

# నేటి నిజం

website:www.netinijam.com

తెలుగు దినపత్రిక

E-mail : netinijam93@gmail.com




హైదరాబాద్ | గురువారం 25-2-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 176 | పేజీలు: 8 | వెల: రూ.1/-

# రైతుల ఆదాయం రెట్టింపే లక్ష్యం

### పీఎం కిసాన్ ద్వితీయ వార్షికోత్సవంలో ప్రధాని

న్యూఢిల్లీ,ఫిబ్రవరి24(ఆర్ఎన్ఎ): రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పీఎం కిసాన్ (ప్రధాని మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన) ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ఆయన ట్వీట్ చేశారు. దేశ ప్రజలకు అన్నం పెట్టే రైతన్నలు ఎందరికో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. పంటల సేకరణ కోసం కనీస మద్దతు ధర(ఎంఎస్పీ)లో చరిత్రాత్మక పెరుగుదలను సాధించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గత ఏడు సంవత్సరాలుగా వ్యవసాయాన్ని మార్చడానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని ఆయన అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మెరుగైన నీటి పారుదల ప్రాజెక్టులు మొదలుకొని.. రైతు రుణాలు పెంచడం, పంటకు సరైన బీమా కల్పించడం, నేలపై దృష్టి సారించడం,



మధ్యవర్తులను తొలగించడం వంటి ఎన్నో ప్రయత్నాలు ఇందులో ఉన్నాయన్నారు. గత రెండేళ్ల కిందట సీఎం కిసాన్ పథకం గౌరవ ప్రదమైన జీవితాన్ని, అలాగే కష్టపడి పని చేసే రైతులకు శ్రేయస్సును అందించే లక్ష్యంతో ప్రారంభించినట్లు తెలిపారు.

# 26న భారత్ బంద్

### బంద్ కు పిలుపునిచ్చిన కాన్ఫడరేషన్ ఆఫ్ ఆలిండియా ట్రేడర్స్
### 40 వేల ట్రేడ్ అసోసియేషన్లు మద్దతిచ్చాయన్న సీఏఐటీ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి24(ఆర్ఎన్ఎ): ఈ నెల 26న భారత్ బంద్ నిర్వహించాలని కాన్ఫడరేషన్ ఆఫ్ ఆలిండియా ట్రేడర్స్ (సీఏఐటీ) ఇచ్చిన పిలుపునకు దాదాపు 40 వేల ట్రేడ్ అసోసియేషన్లు మద్దతు పలికాయి. వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) విధానాన్ని సమీక్షించాలని ఈ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. మరోవైపు కొత్త ఈ-వే బిల్లు విధానాన్ని, కొన్ని నిబంధనలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ బంద్‌కు ఆలిండియా ట్రాన్స్‌పోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఏఐటీడబ్ల్యూఏ) మద్దతు పలికింది. దేశవ్యాప్తంగా డీజిల్ ధరలు ఏకరీతిగా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని ఏఐటీడబ్ల్యూఏ డిమాండ్ చేస్తోంది.

ఏఐటీడబ్ల్యూఏ అధ్యక్షుడు మహేంద్ర ఆర్య మాట్లాడుతూ, అన్ని రాష్ట్ర స్థాయి ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్లు బంద్‌కు మద్దతిస్తున్నట్లు ధ్రువీకరించాయన్నారు. డీజిల్ ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా నిరసన తెలిపేందుకు ఒక రోజు బంద్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త ఈ-వే బిల్లు నిబంధనలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. డీజిల్ ధరలు దేశవ్యాప్తంగా ఒకేవిధంగా ఉండాలన్నారు. డీజిల్ ధరలను తగ్గించాలని కోరారు. సీఏఐటీ ఆదివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఓ లేఖ రాసింది. జీఎస్టీ విధానాలపై ఆందోళన వ్యక్తం చేసింది. మేజర్ ఈ-టెయిలర్స్ ఈ-కామర్స్ రూల్స్‌ను ఉల్లంఘిస్తున్నారని తెలిపింది. జీఎస్టీ స్ట్రక్చర్‌ను సమీక్షించి, ప్రభుత్వానికి సిఫారసులు చేయడానికి ఓ కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. ఈ కమిటీలో సీనియర్ అధికారులు, సీఏఐటీ ప్రతినిధులు, ఇండిపెండెంట్ ట్యాక్స్ ఎక్స్‌పర్ట్స్‌ను నియమించాలని కోరింది.

# ఇక చలో పార్లమెంట్

### 40లక్షల ట్రాక్టర్లతో దిల్లీ మార్చ్
### మరో ర్యాలీకి సిద్ధమౌతున్న రైతు సంఘాలు
### త్వరలో తేదీలు ప్రకటిస్తామని వెల్లడి

జైపూర్,ఫిబ్రవరి24(ఆర్ఎన్ఎ): కేంద్రం నూతన సాగు చట్టాలను రద్దు చేయకుంటే రైతులు పార్లమెంటును ఘోరావ్ చేసేందుకు సిద్ధంగా ఉండాలని రైతు సంఘాల నాయకుడు రాకేశ్ టికాయిత్ పేర్కొన్నారు. ఇందుకోసం 'దిల్లీ మార్చ్' ర్యాలీకి ఏ సందర్భంలోనైనా రైతు సంఘాలు పిలుపు ఇవ్వొచ్చని ఆయన తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం రాజస్థాన్‌లోని సికార్‌లో నిర్వహించిన కిసాన్ మహాపంచాయత్‌లో రైతులను ఉద్దేశించి మాట్లాడారు. 'ఇక పార్లమెంటును ఘోరావ్ చేయాల్సిన సమయం ఆసన్నమైంది. అందుకోసం దిల్లీ మార్చ్ చేపట్టేందుకు త్వరలో మేం ప్రకటన చేస్తాం. ఈ సారి 4 లక్షలు కాదు.. 40 లక్షల ట్రాక్టర్లతో రైతులు కదం తొక్కాలి. పార్లమెంట్ ముట్టడికి సంబంధించిన తేదీని యునైటెడ్ ఫ్రంట్ నాయకులు త్వరలో నిర్ణయిస్తారు. జనవరి 26న రైతులు తలపెట్టిన ట్రాక్టర్ ర్యాలీలో హింసాత్మక ఘటనల ద్వారా రైతుల్ని అపఖ్యాతి పాలు చేసే కుట్ర జరిగింది. ఈ దేశ రైతులు జాతీయ పతాకాన్ని ప్రేమిస్తారు.. కానీ నాయకుల్ని కాదు. కేంద్రం ఈ మూడు సాగు చట్టాల్ని రద్దు చేయకుంటే.. దేశవ్యాప్తంగా ఉద్యమం తీవ్ర రూపం దాలుస్తుంది' అని టికాయిత్ స్పష్టం చేశారు.

# సందెట్లో సడేమియా

### రోడ్డు ప్రమాద మృతుల బంగారు ఆభరణాలు మాయం
### ప్రమాద ఘటనలో దొరికిన బంగారం లెక్కల్లో తేడా
### కూపీ లాగేందుకు రంగంలోకి దిగిన టాస్క్ ఫోర్స్

పెద్దపల్లి,ఫిబ్రవరి24 (ఆర్ఎన్ఎ): జిల్లాలో జరిగిన ఓ ప్రమాద ఘటనలో దొరికిన బంగారం లెక్కల్లో తేడా వచ్చింది. నిన్న ఇద్దరు బంగారం వ్యాపారులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారివద్ద ఉన్న బంగారు ఆభరణాలు మాయమయ్యాయి. పోలీసులు చెబుతున్న లెక్కలకు, అసలుకు మధ్య చాలా వ్యత్యాసం ఉంది. వాస్తవంగా మృతులవద్ద 6 కిలోల 42 తులాల బంగారం ఉంది. అయితే పోలీసులు కిలోన్నర బంగారం స్వాధీనం చేసుకున్నామని మొదట తెలిపారు. తర్వాత లెక్క మార్చారు. రాత్రి 3 కిలోల బంగారం స్వాధీనం చేసుకున్నామంటూ మరో ప్రకటన చేశారు. బంగారం మాయం గుట్టు కూపీ లాగేందుకు టాస్క్ ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగారు. పెద్దపల్లి జిల్లా, రామగుండం, మాల్యాలపల్లి దగ్గర నిన్న రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. వారు ఆంధ్రప్రదేశ్ నరసారావుపేటకు చెందిన బంగారం వ్యాపారులుగా పోలీసులు గుర్తించారు. ఆభరణాలు తయారు చేసుకుని తెలంగాణ ప్రాంతంలోని వివిధ షాపులకు అందజేసేందుకు వారు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

# ఎన్నడూ లేనంతగా మేడారం జాతరకు నిధులు



### మేడారంను జాతీయ పండుగగా గుర్తించాలి
### కేంద్రానికి మంత్రి సత్యవతి రాథోడ్ డిమాండ్

ములుగు,ఫిబ్రవరి24(ఆర్ఎన్ఎ): మినీ మేడారం జాతర సందర్భంగా సమ్మక్క సారలమ్మను దర్శించుకొని మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ సీతారామ్ నాయక్ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. మినీ మేడారం జాతరకు మొదటి సారిగా ప్రభుత్వం నిధులు కేటాయించిందని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చేశామన్నారు. సీఎం కేసీఆర్ గతంలో ఎన్నడూ లేనివిధంగా మేడారం జాతరకు నిధులు కేటాయించారన్నారు. కేంద్రం సమ్మక్క సారలమ్మ జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని సత్యవతి రాథోడ్ తెలిపారు.

# బెదిరించి యువతిపై అత్యాచారం

### ఉత్తరప్రదేశ్ లో వెలుగుచూసిన ఘటన

ఉత్తరప్రదేశ్,ఫిబ్రవరి24 (ఆర్ఎన్ఎ): ఓ యువతి తన స్నేహితుడితో కలిసి ఓ గెస్ట్ హౌస్ కు వెళ్లింది. వారిద్దరూ సరదాగా కూర్చుని మాట్లాడుతుండగా గెస్ట్ హౌస్ యజమాని కుమారుడు చూశాడు. అదే అదనుగా భావించాడు. తనకు తెలిసిన ఇద్దరు పోలీసులకు ఫోన్ చేశాడు. ఆ ఇద్దరు పోలీసులు వచ్చి 'రైడ్' డ్రామా ఆడారు. ఈ సమయంలో మీరిద్దరు ఇక్కడ ఏం చేస్తున్నారు.? వ్యభిచారం చేస్తున్నారా? అసలు మీరు ఎవరు? మీ అమ్మానాన్నలకు ఫోన్ చేయండి అంటూ ఆ పోలీసులు ఆ జంటను భయపెట్టారు. అదే సమయంలో ఆ గెస్ట్ హౌస్ యజమాని కుమారుడు ఎంట్రీ ఇచ్చాడు. ఏం జరుగుతోందంటూ వారిని నిలదీశాడు. పోలీసులను పక్కకు తీసుకెళ్లాడు. ఆ తర్వాత ఆ జంట వద్దకు వచ్చాడు. 'నాకు సహకరిస్తే ఈ కేసు నుంచి మిమ్మల్ని బయటపడేస్తా' అన్నాడు. లేదంటే పత్రికల్లో రచ్చ రచ్చ అవుతుందని బెదిరించాడు. చివరకు ఆ యువతిపై అత్యాచారానికి ఒడిగట్టాడు. ఆ తర్వాత పోలీసులు ఆ జంట వద్ద ఉన్న డబ్బును తీసుకుని ఎస్కేప్ అయ్యారు. ఉత్తరప్రదేశ్ లో జరిగిన ఈ ఘోర ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మీరట్ జిల్లా నాచండి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ అతిథి గృహం ఉంది. అక్కడకు సాధారణంగా ఎవరూ రారు. ఎప్పుడూ నిర్మానుష్యంగా ఉండే ఆ అతిథిగృహానికి ఫిబ్రవరి 20వ తారీఖున శనివారం ఓ యువతి తనకు తెలిసిన యువకుడితో కలిసి వెళ్లింది. అతడితో ఆ గెస్ట్ హౌస్‌లో కూర్చుని మాట్లాడుతోంది. దీన్ని ఆ గెస్ట్ హౌస్ యజమాని కుమారుడు చూశాడు. తనకు తెలిసిన పోలీసులకు ఫోన్ చేసి అక్కడకు రప్పించాడు. పోలీసులు రైడ్ అంటూ వారిని బెదిరించి భయపెట్టారు. కేసులంటూ పోలీసులు అంటుండగా అక్కడకు ఆ గెస్ట్ హౌస్ యజమాని కుమారుడు ఎంట్రీ ఇచ్చాడు. యువతీయువకులను సపోర్ట్ చేస్తున్నట్టు మాట్లాడి పోలీసులను పక్కకు తీసుకెళ్లాడు.

# శబరి, సీఏఏ కేసులను ఎత్తివేయాలని కేరళ క్యాబినెట్ నిర్ణయం

తిరువనంతపురం,ఫిబ్రవరి24 (ఆర్ఎన్ఎ): శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలోకి మహిళ ప్రవేశంపైన, పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా నమోదైన కేసులను ఎత్తివేయాలని కేరళ క్యాబినెట్ నిర్ణయించింది. తీవ్రమైన నేరాలు కానందున ఆయా ఆందోళనలకు సంబంధించిన కేసులను ఎత్తివేయాలని నిర్ణయించామని కేరళ ప్రభుత్వం తెలిపింది. శబరిమలలో మహిళల ప్రవేశంపై నిషేధానికి వ్యతిరేకంగా గతంలో కొంతమంది మహిళలు ఆందోళనకు దిగారు. అయితే ఆలయంలోకి మహిళల ప్రవేశంపై నిషేధాన్ని సమర్థిస్తూ మరోవర్గం ఆందోళనకు దిగింది. ఆ ఆందోళనల సందర్భంగా కేరళలో పలుచోట్ల ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఆందోళనల్లో పాల్గొన్న చాలామందిపై పోలీసులు కేసులు నమోదుచేశారు. అదేవిధంగా కేంద్రప్రభుత్వం గత ఏడాది తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా దేశంలోని వివిధ రాష్ట్రాలతోపాటు కేరళలోనూ ఆందోళనలు జరిగాయి. ఆ ఆందోళనలకు సంబంధించి కూడా పోలీసులు పలువురిపై కేసులు నమోదు చేశారు. అయితే, ఆ రెండు ఘటనలకు సంబంధించిన కేసులన్నింటిని ఎత్తివేయాలని తాజాగా కేరళ క్యాబినెట్ నిర్ణయించింది. కాగా, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఓట్ల కోసమే కేరళ ప్రభుత్వం కేసులను ఎత్తివేస్తున్నదని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

# తండ్రి కుటుంబ సభ్యులు వారసుల పరిధిలోకి వస్తారు

### హిందూ మహిళ తన ఆస్తిని పుట్టింటి సభ్యులకు ఇవ్వోచ్చు
### సుప్రీంకోర్టు సంచలన తీర్పు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి24 (ఆర్ఎన్ఎ): దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. దేశంలోని ప్రతి మహిళ తన తండ్రి నుంచి వచ్చిన వారిని ఆమె ఆస్తికి వారసులుగా తీసుకోవచ్చని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. తన పుట్టింటి వారిని కుటుంబ సభ్యులుగా అంగీకరించవచ్చని.. వారిని బయటి వ్యక్తులుగా తీసుకోలేమని స్పష్టం చేసింది. హిందువుల వారసత్వ చట్టం ప్రకారం సెక్షన్ 15.1 ఱ పరిధిలోకి వస్తారని.. తండ్రి తరుపున కుటుంబసభ్యులు కూడా ఆస్తికి వారసత్వంగా తీసుకోవచ్చని తెలిపింది. 1956లో హిందూ వారసత్వ చట్టం సెక్షన్ ప్రకారం ప్రతి మహిళ తండ్రి కుటుంబ సభ్యులు వారసుల పరిధిలోకి వస్తారని తీర్పు వెల్లడించింది. జస్టిస్ అశోక్ భూషణ్ ధర్మాసనం సెక్షన్ 13.1 డీ ద్వారా తండ్రి వారసులను తన ఆస్తి వారసులుగా తీసుకోవచ్చని.. వారు ఆస్తిని పొందేందుకు వీలుందని స్పష్టం చేసింది. కానీ స్త్రీ తండ్రి నుంచి వారసులుగా వచ్చినప్పుడు.. ఆస్తిని ఎవరు సంపాదించినా.. తండ్రి కుటుంబ సభ్యులు ఆ స్త్రీకి కూడా కుటుంబసభ్యులవుతారని స్పష్టం చేసింది. జగ్నో అనే మహిళ తన భర్త ఆస్తిని పొందడంపై కేసు నమోదైన క్రమంలో కోర్టు ఈ తీర్పు వెల్లడించింది. ఆమె భర్త 1953లో మరణించాడు. వారికి సంతానం లేకపోవడంతో.. ఆమెకు వ్యవసాయ ఆస్తిలో సగం వాటా వచ్చింది. సెక్షన్ 14 ప్రకారం, 1956 వారసత్వం చట్టం ప్రకారం ఆమె ఆ ఆస్తికి వారసురాలు అయ్యింది. దీని తర్వాత ఆమె ఆ ఆస్తి కోసం ఒక ఒప్పందం కుదుర్చుకొని తన సోదరుడి కొడుకులను ఆస్తిని ఇచ్చింది. దీంతో ఆమె భర్త సోదరుడి కొడుకులు ఆ ఆస్తి తమకు చెల్లుతుందని వారి ఆస్తి వారికి ఇవ్వాలని 1991లో సివిల్ కోర్టులో దావా వేశారు. తన భర్త ఆస్తిని ఆమె సోదరులకు ఇచ్చేందుకు ఆమోదించాలని జగ్నో తిరిగి హైకోర్టును ఆశ్రయించింది. అదే సమయంలో ఆమె భర్త సోదరుడి కుమారులు అందుకు ఒప్పుకోలేదు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు హిందూ వితంతువు తన తండ్రి కుటుంబంతో తిరిగి ఉమ్మడి కుటుంబాన్ని ఏర్పాటు చేయడానికి వీల్లేదని.. ఆమె భర్త ఆస్తిని ఆమె సోదరుడి కొడుకుల పేరు మీద చేయలేమని స్పష్టం చేసింది. ఆ ఆస్తి అనేది ఇప్పటికే ఆస్తిలో హక్కు ఉన్నవారితో మాత్రమే ఈ సమస్య పరిష్కరించుకోవాలని పేర్కొంది. దీంతో హైకోర్టు ఈ కేసును కొట్టివేసింది. అనంతరం జగ్నో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు హిందూ వారసత్వ చట్టంలోని సెక్షన్ 15.1డీ ప్రకారం హిందూ మహిళా తన తండ్రి బంధువులు, కుటుంబ సభ్యులు తనకు బయటివారు కాదని వారు కూడా ఆమె కుటుంబంలోని సభ్యులేనని తెలిపింది. చట్టంలో కుటుంబం అనే పదానికి సంకుచిత అర్థం ఇవ్వలేమని.. చట్టంలో హిందూ మహిళ కుటుంబం పట్ల కూడా వివరణ ఉందని తెలిపింది. ఇప్పటికే హక్కులను సృష్టించిన ఆస్తిపై ఏదైనా సిఫారసు డిక్రీ ఉంటే, రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 17.2 కింద రిజిస్ట్రేషన్ చేసుకోవలసిన అవసరం లేదని కోర్టు స్పష్టం చేసింది.

# గుజరాత్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ పాగా

### ఆప్ 27 డివిజన్లలో విజయకేతనం
### బీజేపీకి కంట్లో నలుసులా మారిన కేజ్రీవాల్

గుజరాత్,ఫిబ్రవరి24 (ఆర్ఎన్ఎ): యావత్ దేశంలో ప్రధానమంత్రి నరేంద్రమోడిని ఎన్డీయేకి నేతృత్వం వహిస్తున్న బీజేపీని బాగా కలవరపెడుతున్నదెవరయ్యా అంటే నిస్సందేహంగా అరవింద్ కేజ్రీవాల్ అనే చెప్పాలి. కేజ్రీవాల్ మూడోసారి ఢిల్లీ ముఖ్యమంత్రిగా కంటిన్యూ అవుతున్న విషయం అందరికీ తెలిసిందే. మోడికి కేజ్రీవాల్ పక్కలో బల్లెం కంట్లో నలుసు లాగ తయారయ్యారనే ఉపమానాలు ఎన్నిచెప్పినా చాలవు. అలాంటి ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) గుజరాత్ లో కూడా అడుగుపెట్టింది. మొన్నటి 21వ తేదీన గుజరాత్ లోని ఆరు మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికలు జరిగాయి. వీటన్నింటిలోను సహజంగానే బీజేపీనే విజయకేతం ఎగరేసింది. గుజరాత్ ఎన్నికల్లో బీజేపీ గెలవటం పెద్ద వార్తేకాదు. ఎందుకంటే దశాబ్దాలుగా ఈ రాష్ట్రంలో బీజేపీనే అధికారంలో ఉంది కాబట్టి. గుజరాత్ లో అధికారంలో ఉండటానికి తోడు కేంద్రంలో అధికారంలో ఉండటంతో పరిస్థితులన్నీ అనుకూలించి ఎన్నికల్లో గెలుస్తోంది. అయితే తాజాగా జరిగిన ఆరు కార్పొరేషన్ ఎన్నికల్లో సూరత్ కూడా ఒకటి. సూరత్ లోని 120 డివిజన్లలో బీజేపీకి బద్ధశతృవు అయిన ఆప్ 27 డివిజన్లలో విజయకేతనం ఎగరేసింది. సూరత్ కార్పొరేషన్లో బీజేపీకి 93 సీట్లు వస్తే మిగిలిన 27 డివిజన్లు ఆప్ గెలుచుకుంది. మిగిలిన కార్పొరేషన్లతో పాటు సూరత్ లో కూడా ప్రధాన ప్రత్యర్థిగా కాంగ్రెస్ తో పాటు ఇతర చిన్నా చితక పార్టీలు పోటీపడ్డాయి. అయితే వాటిన్నింటినీ కాదని జనాలు ఆప్ ను ఏకంగా 27 డివిజన్లలో గెలిపించటమే ఆశ్చర్యంగా ఉంది. పైగా ఆప్ గుజరాత్ స్థానికసంస్థల ఎన్నికల్లో పోటీ చేయటం ఇదే మొదటిసారి. ఆమధ్య జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కేజ్రీవాల్ ను ఓడించాలని మోడి అమిత్ షా తో పాటు మొత్తం బీజేపీ ఎంతగా ప్రయత్నించిందో అందరికీ తెలిసిందే. అయితే కేజ్రీవాల్ ఒక్కరే మొత్తం మోడి టీమ్ ను అనూహ్యంగా మట్టి కరిపించారు. అప్పటి నుండి కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని కేంద్రం రాచి రంపాన పెడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో నరేంద్రమోడి సొంత రాష్ట్రమైన గుజరాత్ లో కూడా ఆప్ కాలుపెట్టడం ఆశ్చర్యంగానే ఉంది. ఆప్ లాగే మొదటిసారి పోటీ చేసిన ఎంఐఎం పార్టీ కూడా అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఏడు డివిజన్లలో గెలిచింది. ఎంఐఎం కూడా గుజరాత్ స్థానిక సంస్థల ఎన్నికల్లో మొదటిసారి పోటీ చేయటం గమనార్హం. ఎంఐఎంతో కూడా బీజేపీ సిద్ధాంతపరమైన వైరుధ్యాలు చాలా ఉన్నాయి. రాజకీయంగా తీవ్రంగా విభేదించుకునే ఆప్ ఎంఐఎం పార్టీలు రెండు గుజరాత్ లో కాలుపెట్టి విజయం సాధించటాన్ని బీజేపీ ఎలా పరిగణిస్తుందో ఆసక్తిగా మారింది.

# ఏడు రాష్ట్రాల్లో కొత్త వేరియంట్లు

### -ఏడు రాష్ట్రాలను హెచ్చరించిన కేంద్రం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి24 (ఆర్ఎన్ఎ): దేశంలో కరోనా మహమ్మారి తిరిగి విజృంభిస్తున్నది. వివిధ రాష్ట్రాల్లో పెరుగుతున్న కేసులు ఇందుకు ఉదాహరణ. ఈ విషయంలో కేంద్రం ఇప్పటికే ఏడు రాష్ట్రాలను హెచ్చరించింది. ఏడు రాష్ట్రాల్లో కొత్త వేరియంట్లు ఉన్నాయని, జాగ్రత్తగా ఉండాలని సూచించింది. దీంతో ఢిల్లీ ప్రభుత్వం ఓ కొత్త రూల్ ను తీసుకొచ్చింది. మహారాష్ట్ర, కేరళ, మధ్యప్రదేశ్, ఛత్తీస్ గడ్, పంజాబ్ రాష్ట్రాల నుంచి వచ్చే ప్రయాణికులు ఇకపై తప్పనిసరిగా కరోనా నెగెటివ్ సర్టిఫికెట్ క్యారీ చేయాలనీ, నెగెటివ్ సర్టిఫికెట్ ఉంటేనే రాష్ట్రంలోకి అనుమతి ఉంటుందని ప్రకటించింది. దీంతో ఆయా రాష్ట్రాల నుంచి వచ్చే ప్రయాణికులు ఇప్పుడు నెగెటివ్ సర్టిఫికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా పొరుగు రాష్ట్రమైన కేరళలో కూడా ఈ వైరస్ శరవేగంగా వ్యాపిస్తోంది. దీనికి నిదర్శనమే.. సోమవారం ఒక్కరోజే కేరళలో ఏకంగా 2,212 పాజిటివ్ కేసులు నమోదు కావడం. దీంతో కేరళలో ఆస్పత్రుల్లో కరోనా చికిత్స పొందుతున్న వారి సంఖ్య ఒక్కసారిగా 5514కు పెరిగింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా అప్రమత్తమైంది. రాష్ట్ర సరిహద్దు జిల్లాల యంత్రాంగాలకు హెచ్చరికలు చేసి, తగిన భద్రతాచర్యలు చేపట్టాల్సిందిగా ఆదేశాలు జారీచేసింది. సోమవారం నుంచే సరిహద్దుల్లో ముందు జాగ్రత్త చర్యలను అధికం చేశారు. కేరళ సరిహద్దు జిల్లాలైన కోయంబత్తూరు, నీలగిరి, తేని జిల్లాల్లోకి వచ్చే అన్ని రకాల వాహనాలను నిశితంగా తనిఖీ చేస్తున్నారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరినీ థర్మల్ స్క్రీనింగ్ చేస్తున్నారు. శరీర ఉష్ణోగ్రత అధికంగా వుంటే మాత్రం రాష్ట్రంలోకి అనుమతించకుండా వెనక్కి తిప్పిపంపుతున్నారు. అలాగే, ముంబై, పంజాబ్ వంటి ప్రాంతాల నుంచి విమానాలు, రైళ్లలో ప్రయాణ భారీ సంఖ్యలో ప్రయాణికులు రాష్ట్రానికి వస్తున్నారు. ముఖ్యంగా విమాన ప్రయాణికులను కూడా శరీర ఉష్ణోగ్రతలు, ఇతర వివరాలను సేకరించాల్సిందిగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# కవితపై బీజేపీ ఆరోపణలను ఖండించిన టీఆర్ఎస్ ఎన్నారై

హైదరాబాద్,ఫిబ్రవరి24(ఆర్ఎన్ఎ): ఎమ్మెల్సీ, టీబీజీకేఎస్ యూనియన్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితపై చేసిన ఆరోపణలను బీజేపీ అధికార ప్రతినిధి తరుణ్ చుగ్ ఉపసంహరించుకోవాలని ఎన్నారై టీఆర్ఎస్ డిమాండ్ చేసింది. తెలంగాణ పర్యటనలో భాగంగా శ్రీరాంపూర్‌లో తరుణ్ చుగ్ చేసిన ఆరోపణలను ఉపసంహరించుకుని కవితకు తక్షణమే క్షమాపణలు చెప్పాలని ఎన్నారై టీఆరెస్ సభ్యులు ఆకుల శ్యామ్ డిమాండ్ చేశారు. శ్యామ్ మాట్లాడుతూ.. సింగరేణిని అవినీతిమయం చేశారన్న ఆరోపణలను తరుణ్ చుగ్ నిరూపించాలని, లేని పక్షంలో తెలంగాణలో ఆయనను తిరగనీయమని హెచ్చరించారు. టీఆరెస్ పార్టీపై, కవితపై లేనిపోని ఆరోపణలు చేస్తే తెలంగాణ ప్రజలు వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీని చిత్తుగా ఓడిస్తారని అన్నారు. త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులందరూ టీఆఎస్ పార్టీకి ఓటు వేయాలని ఆకుల శ్యామ్ విజ్ఞప్తి చేశారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ ఘనుడై - ఆనయము హిందూ
జన హితమును గోరినట్టి చైతన్యముగా
'జనసంఘము'కు వెన్నెముకగా
మృగతుల నిడి గాతి చెద బలరాజు మధోకునే !!



-రాధశ్రీ

(ఫిబ్రవరి 25 ఒక నాటి నేత బలరాజమధోక్ జయంతి..)

సెల్: 9494481210



నేటినిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
గురువారం 25-2-2021 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 హైదరాబాద్ 3

### నమ్మలేని నిజాలు

ఆనందయాత్ర
మంచి చెడుల చిట్టా
అంతిమయాత్ర

ప్రయాణభయం
రహదారోత్సవాలు
పేరు కోసమా?

పుట్టినరోజు
రాతపూతలోడికి
మట్టిగుర్తులు

మారింది రేఖ
మకరసంక్రమణం
రథసప్తమి

మళ్లీ మొదలు
కరోనకలకలం
వీడనిపీడ



- రేడియమ్
సెల్: 9291527757

### శ్రీనిజాలు

చిన్న పెద్ద రాజ్యాలను
పాలించేది భువిరాజు !
గద్య పద్య కావ్యాలను
సృజించేదీ కవిరాజు !

రాత్రి పొట్ట దాగి ఉన్న
పుట్టుకొస్తాడు రవి !
సమాజాన్ని జాగృతికై
ప్రవేశిస్తాడు కవి !



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

### నిద్ర

రాత్రిపూట చీకటి
రెప్పలను అతికిస్తుంది,
నిద్రకు అదే ప్రారంభం.
ముగింపుకు
స్పష్టమైన కారణాలుండవు గాని
అదే మెలకువ.

మధ్యలోనే
జీవించడం ఆగిపోతుంది
లేదా
తెలియని కొత్తలోకంలోకి ప్రవేశిస్తాం.
స్వప్నసీమ అంటే అదే కావచ్చు.
స్వప్నమంటే
సుదీర్ఘ కాలపేటికను
గర్భీకరించుకున్న త్రుటిక.

రెండు కాలాలు వేరు
ప్రాంతాలు రెండు వేరు
స్వభావాలు వేరు
సందర్భాలు వేరు వేరు
అక్కడికి వెళ్లామని ఇక్కడా
ఇక్కడి కొస్తామని అక్కడా
ఒక తెలియని మార్మికత.

చెట్లు వేళ్లు
మట్టిలో ఒదగడం
ఆ తర్వాత
పువ్వులు పూయడం
అలాంటిదే కావచ్చు
ఇదంతా.



-డా॥ ఎన్. గోపి
సెల్:9391028496

# కష్టజీవుల పక్షాన రాసిన కవిత్వం కలకాలం నిలుస్తుంది- డా॥ నందిని సిధారెడ్డి



పుస్తకావిష్కరణలో మహ్మద్ షరీఫ్, కడియాల మధుసూధన్, చల్లగాలి వెంకటరాజు, డా॥నందిని సిధారెడ్డి, ఆవిష్కర్త బైస దేవదాసు, దోరవేటి, డా॥ తూర్పు మల్లారెడ్డి, పున్న అంజయ్య, అంబటిపూడి వెంకటసుబ్రహ్మణ్య శాస్త్రి, పయనీర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపాల్ కుమార్.



డా॥ నందిని సిధారెడ్డికి గ్రంథాన్ని అంకితమిస్తున్న రచయిత దోరవేటి.



రచయిత దోరవేటిని సత్కరిస్తున్న అతిథులు.

కష్టజీవుల పక్షాన రాసిన కవిత్వం కలకాలం నిలుస్తుందని తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షులు డాక్టర్ నందిని సిధారెడ్డి అన్నారు. ప్రముఖ సాహితీవేత్త శ్రీ దోరవేటి రచించిన శ్రమ దేవోభవ గ్రంథ ఆవిష్కరణకు విచ్చేసి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దోరవేటి శ్రమ పట్ల, శ్రామికుల పట్ల సానుభూతితో శ్రమ గొప్పదనాన్ని కీర్తిస్తూ గొప్ప కావ్యం రాశారని కొనియాడారు. దోరవేటి తన 'శ్రమ దేవోభవ' కావ్యాన్ని నందిని సిధారెడ్డి కి అంకితం చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి 'శ్రమ దేవోభవ' ఖండ కావ్యాన్ని ఆవిష్కరించిన నేటి నిజం సంపాదకులు బైస దేవదాసు మాట్లాడుతూ ఒక అక్షర శిల్పి తన కావ్యాన్ని మరొక అక్షర శిల్పి కి అంకితమివ్వడం అపురూపమైన ఘట్టంగా అభివర్ణించారు. శ్రమ దేవోభవ కావ్యంలోని ప్రతి పద్యము పాఠకుడిని ఆలోచింపజేస్తుందని అభిప్రాయపడ్డారు.

పయనీర్ కాన్సెప్ట్ స్కూల్ అధినేత ప్రమోద్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశలో పిల్లలు శ్రమ విలువను తెలుసుకోవాలన్నారు. శ్రమ దేవోభవ కావ్యాన్ని డాక్టర్ తూర్పు మల్లారెడ్డి సమగ్రంగా సమీక్షించారు. విద్యార్థులు ఉత్తమ వ్యక్తిత్వాన్ని అలవర్చుకోవల్సిన అవసరాన్ని, దోర వేటి సాహిత్య ఔన్నత్యాన్ని ఆయన వివరించారు. సాహితీ మేఖల చండూరు సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సాహితీ మేఖల అధ్యక్షులు అంబటి పూడి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి అధ్యక్షత వహించారు.

ఈ కార్యక్రమంలో ప్రముఖ సామాజికవేత్త నరసింహులు గుప్త, సాహితీ మేఖల ప్రధాన కార్యదర్శి పున్న అంజయ్య, మద్దోజు సుధీర్ బాబు, ఐ. సచ్చిదానందం, సాగర్ల సత్తయ్య, మహమ్మద్ షరీఫ్, కడియాల మధుసూదన్ రావు, చల్లగాలి వెంకట రాజు, చీదెళ్ళ సీతాలక్ష్మి, పరిమి వెంకట సత్యమూర్తి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### అన్నదాతా! సుఖీభవ!

నాడైనా నేడైనా రేపైనా
పుడమిని నిలబెట్టేది రైతే
ఆవురావురుమనే జనావళి ఔ
కడుపుమంటను చల్లార్చేది రైతే.
తన తల్లి ధరిత్రి తండ్రి ప్రకృతి
కాని తోటి మానవులే తోడేళ్లవంటి తమ్ముళ్లు
పాలకులే కిరాతక దుష్కృతాసురులు.
ప్రపంచానికి పచ్చదనపు దుప్పటి కప్పే రైతు
ఎరుపెక్కిన కళ్లతో ఆగని కన్నీళ్లతో
నిస్సహాయ నిశ్చేష్టుడవటం
మనుష్యకోటి దిక్కుమాలిన తనం
జనులందరి కడుపులు నింపేవాడు
తన కడుపెండగొట్టుకొని బతకడం
రాజ్యాంగాల సిగ్గుమాలినతనం.
దేశానికి వెన్నెముకకే వెన్నెముక నిలబడకపోతే
పురోగతి అంతా అధోగతే
అన్నదాత అవసరాల పట్టింపులేని
ఎజండాల జండాలెగరేసే గూండాలు
రైతుల పాలిటి రావణాసురగండాలు
నిత్యం స్వేదాశ్రు తర్పణం చేసే కర్షకుడు
ఆగ్రహిస్తే భూగ్రహం దద్దరిల్లి బద్దలౌతుంది
అన్నదాత అవనికి దేవుడిచ్చిన భ్రాత
అతడు జగతి జనుల క్షుధాత్రాత
రైతన్న సుఖశాంతులతో ఉండుగాత!



-తుమ్మూరి రాంమోహన్ రావు
9701522234

# కవిత్వం ఒక గమ్యం కాదు..!!

కవిత్వం నచ్చితే నచ్చిందని, నచ్చకపోతే నచ్చలేదని, చెప్పడానికి ఎవరేమనుకుంటారో అని తటపటాయిస్తూ బతుకుతున్న రోజుల్లో– తనకిష్టమైన కొలమానాల మేరకు, ఒకే స్థాయిలో ఉన్న కవిత్వమంతా గొప్పదని, ఆస్వాదించి, ఆమోదించు కోవడం కేవలం అది వ్యక్తిగత భావన అవుతుంది.

> "కవిత్వానికైనా, జీవితానికైనా సొంత గొంతుక అత్యవసరం. మూసివున్న, లేదా మూసి వున్నట్లనిపించే ప్రపంచాన్ని తెరిచేవాడు కవి"

ఒక సామాజిక ప్రయోజనాన్ని ఆశించి రచనలు చేయడం వేరు. అలాగే రాయాలి కాబోలు అని ఆంక్షలు పెట్టుకోవడం వేరు. కవి అంతరంగంలో సుడులు తిరిగే భావం, పద్యం, గద్యం, గేయం, కథ, కవిత, పాట, హైకూ, నానీ, రెక్కలు ఇత్యాది కవితా రూపాల్లో వెలువడి, పాఠకున్ని ఆలోచింపచేస్తాయి. అప్పుడప్పుడూ ఆవేదనకు గురి చేస్తాయి.

ఏ రచనా ప్రక్రియలోనైనా దృష్టి కోణాన్ని గాఢంగా ఎంచుకోవాలి. తగిన అధ్యయనం తప్పకుండా ఉండాలి. జీవన వాస్తవికతను ఎప్పటి కప్పుడు సంగ్రహిస్తూ వుండాలి. అన్ని సామాజిక పరిణామాన్ని, ప్రజాస్వామిక ఆకాంక్షలను, అనుభవ విశేషాలను, కళా నైపుణ్యాన్ని, ప్రస్తుత కాలమాన పరిస్థితుల్ని, అనుభవ పూర్వకంగా అవగాహన చేసుకుంటూ, సకాలంతో సమభావంతో సాహిత్యంతో అనుక్షణం సంధానించుకోవాలి.

కవి తన సరేంద్రియాలను తాత్వికతకు స్పందించే మూలాలపై ఎంతో ఏకాగ్రత చూపిస్తేనే, ఇటువంటి అద్భుతభావం స్థిరపడి, విలువల్ని వెదజిమ్ముకుంటూ, నిగూఢమైన భావాంశాన్ని బలంగా కవితాత్మకంగా వ్యక్తపరుస్తాయి. ఉత్తమ కవితా విలువలు గురించి సమగ్రమైన అవగాహన కలిగిస్తాయి. అవ్యక్తమైన ఆనందం వెలుగురేఖలు, ఈ లోకానుభూతులకు భిన్నమైన స్పర్శ మనసు ఆవరించి, ఉత్సాహాన్ని ఉద్వేగాన్ని కలిగిస్తాయి.

కవిత్వం ఒక గమ్యం కాదు. అదెప్పుడూ వొక మజిలీ మాత్రమే. అనివార్యమైన భావాల ఉప్పెనగా ముంచెత్తుతుంది. దానికి ఎవరూ ఏ ఆనకట్టా వేసి బంధించలేరు. ఒకవేళ బంధిస్తే. అక్కడ కవిత్వం నిలువ నీరైపోతుంది. కట్టుగొయ్యలూ కృత్రిమమైన కట్టుబాట్లతో, అకవిత్వంగా రూపుదిద్దుకుంటుంది. ప్రవాహం కవిత్వ లక్షణం. ఇక్కడే వుంటానన్న సుస్థిరభావనే అకవిత్వమౌతుంది.

> "ప్రజలకు కష్టమొచ్చిన ప్రతిసారీ కవులెందరో తమ కలాలతో, గళాలతో జాతి పునరుజ్జీవింపచేశారు. ప్రతి చారిత్రక అవసరంలోనూ, ఈ దేశాన్ని కాపాడేదీ, చైతన్యాన్ని రగిలించేది కవులే"

ఒకే వస్తువు మీద వేరు వేరు కవులు రాసిన కవితల ఎత్తుగడలలోని విభిన్నతను పరిశీలిస్తే, కవి ప్రాపంచిక దృష్టిననుసరించి ఒక్కొక్క కవి, ఆయా వస్తువులలోని ఒక్కొక్క పార్శ్వానికి ప్రాధాన్యమిచ్చినట్లు తెలుస్తుంది. కవికున్న నిర్మాణ శిల్ప స్పృహతో పాటు కవి ప్రాపంచిక దృష్టికోణం, వస్తువుతో తాదాత్మ్యం, నిజాయితీ, భాషా సాహిత్య పరిజ్ఞానం, తాను లక్ష్యంగా భావించే పాఠకవర్గం మొదలైన ఎన్నిటికో ఎత్తుగడ ప్రతిఫలిస్తుంది.

కవి కూడా అక్షరాల మనిషి అయిపోతున్నాడు. సత్యాల పరిశీలనల ఉన్నత శిఖరాల నుండి, సంకుచిత జాగ్రత్తల మైదానాలలోకి జారిపోతున్నాడు. భావాలను పదాల తెంపులతో నింపుతున్నాడు. సామాజిక జీవితాలలోని సంఘర్షణలలోని, వాస్తవికతను గమనించలేకపోతున్నాడు.

ప్రపంచీకరణ నేపథ్యంలో సాహిత్యం ముక్కలైపోయింది. అస్థిత్వ రాజకీయాలు వచ్చాక, వేటికవే ప్రత్యేకమైపోయాయి. సాధారణ లక్షణం, ప్రత్యేక లక్షణం కలిసి వుంటాయి. కనుక ఆ విధంగానే చూడాలి. అస్థిత్వంతో పాటు సాధారణ సాహిత్యాన్ని కూడా చూడాలి. ప్రపంచీకరణ వలన ఎక్కువగా నష్టపోయేది సామాన్య ప్రజానీకమే.

కవిత్వానికైనా, జీవితానికైనా సొంత గొంతుక అత్యవసరం. మూసివున్న, లేదా మూసి వున్నట్లనిపించే ప్రపంచాన్ని తెరిచేవాడు కవి. నిజాల్నీ, అబద్ధాల్నీ తేల్చుకునేందుకు తలుపులు తెరవడం అత్యవసరం కూడా. కవిలో ఎంతో విద్వత్తు ఉండాలి. అటువంటి రచన ఎంతో మంచిగా ఉండితీరాలి. ఈ విధమైన మహత్తర రచనలు చేయడం కొందరికే సాధ్యమౌతుంది. అటువంటి కవి రచన గురించి ఆలోచనలో ఏర్పడే మానసిక రూపంలో అనుభవస్థితి ఉన్నత స్థాయిలో ఉంటుంది.

ఆధునిక భావజాలంతో జీవిత వాస్తవాన్ని సామాజిక స్పందనల్ని ఆవిష్కరించడంలో స్వేచ్ఛా కవిత్వం సంపూర్ణంగా విజయవంతమైంది. దీనికి ప్రత్యామ్నాయం లేదన్న మాట కూడా ఋజువవుతుంది. సహృదయ ప్రపంచంలో ఒక అవగాహనతో ఆ కవితాకృతికి ప్రాచుర్యం యశస్సు లభిస్తుంది.

కవి తన చుట్టూ ఉన్న ప్రపంచంలో ప్రతి చిన్న మార్పుకు స్పందిస్తాడు. రైతుల అతివృష్టి, అనావృష్టి, పర్యావరణం, మత ఛాందసవాదం ఇత్యాదులపై ఆవేదన చెందుతాడు.

కాలానుగుణంగా, అవసరానుగుణంగా కవిత్వానికీ, కళలకూ, పారమార్థిక ప్రయోజనాలుంటాయి. ప్రజలకు కష్టమొచ్చిన ప్రతిసారీ కవులెందరో తమ కలాలతో, గళాలతో జాతి పునరుజ్జీవింపచేశారు. ప్రతి చారిత్రక అవసరంలోనూ, ఈ దేశాన్ని కాపాడేదీ, చైతన్యాన్ని రగిలించేది కవులే.

సమాజ జీవితంలోని అపూర్వతకు స్పందించి, దాన్ని అంతఃకరణంలో ప్రతి ఫలించుకొని, ఆ అనుభవానికి సామాజిక ప్రయోజనం దృష్ట్యా వస్తు రూపాన్ని నిర్మాణం చేయడం వల్లనే కవులూ, రచయితలూ ప్రజలందరి నుండీ ముందుకు వచ్చి, మార్గ దర్శకులు కాగలుగుతున్నారు.



-ఎస్.ఆర్.భల్లం
సెల్: 9885442642

### "రైతు జీవితం" అంశంపై కవితలకు ఆహ్వానం..







రైతే రాజన్నారు
రైతే దేశానికి వెన్నెముక అన్నారు
రైతు లేనిదే దేశానికి ప్రగతి లేదన్నారు
రైతే అన్నదాత అన్నారు
తినే ప్రతి గింజమీద మనపేరు ఉంటుందని
అలాంటి ప్రతి గింజను పండించే రైతే
పరబ్రహ్మ స్వరూపం అన్నారు
మరి ఈ రోజు రైతు పరిస్థితి ఏమిటి?
ఎండనక, వాననక
నడిరోడ్డుపై నిస్సహాయంగా చూసే పరిస్థితి
ఈరోజు ఎందుకొచ్చింది?
నేలతల్లిని నమ్ముకున్న రైతుకు
పోరాటం ఎందుకు చేయాల్సి వస్తోంది?

**మీ కలాలు ఇచ్చే సమాధానం ఏమిటి?**

పాతిక వాక్యాలు మించకుండా
రైతు సమస్య పరిష్కార దిశగా
కలాలను కదిలించండి..

'నేటినిజం' దినపత్రిక,
ఎస్.ఆర్.టి–74, జవహర్‌నగర్, హైదరాబాద్–20
లేదా E-mail : netinizam2020@gmail.com
పేజ్‌మేకర్ ఓపెన్‌ఫైల్, అనుస్క్రిప్ట్–7లో డిటిపి చేసి మెయిల్ చేయండి..

ఉత్తమమైన కవితలతో 'నేటినిజం' ప్రత్యేక సంచికను వెలువరిస్తుంది. వెంటనే మీ రచనలు పంపగలరు.



### విరబూసిన జాతి



భారతీయతకు అద్దం పట్టే
అందాల ఖద్దరు వస్త్రధారిణి
భారతీయతను వేనోళ్ళ చాటిన
మహిళామణి
సత్యాగ్రహ ఆయుధాన్ని
ఆంగ్లేయులపై గురి చూసి సంధించిన ధీశాలి
మధుర పదాలను మూటకట్టి
ప్రపంచ ప్రజానీకానికి పంచిపెట్టి
ఎల్లజనుల హృదయాలపై నిలిచే
కవితలల్లిన మహాకవయిత్రి
కోయిలగాన మాధుర్యాన్ని
గాలం వేసి పట్టుకొని
తన గొంతులో నింపుకున్న
భారత నైటింగేల్
ఆనందంగా ఉయ్యాలలూగిన బాలిక
చాలిక మీ పరిపాలనంటూ
క్విట్ ఇండియా ఉద్యమంలోకి
దూసుకెళ్ళిన ధీరవనిత
అన్ని హంగులూ ఆర్భాటాలున్న జీవితాన్ని
జాతికంకితమిచ్చిన త్యాగశీలి
ఐకమత్యమే జీవితసారమంటూ
అన్ని మతాల సంస్కృతులనూ ఆదరించి
అందరికీ అందించిన లౌకికవాది
అన్నార్తుల ఆర్తనాదాలు
అవనికి చేటంటూ
తన ఆస్తులనందరికీ పంచిన
సామ్యవాది
స్వాతంత్ర్యోద్యానవనంలో
విరబూసిన ఓ జాతి గులాబీ
నీవందించిన పరిమళాలేకదా
మేము ఆస్వాదించి ఆనందిస్తున్న
స్వేచ్ఛాగాలుల్లో చొచ్చుకుపోయాయి
తల్లీ! సరోజినీదేవీ!
నీ సేవలు మేమెప్పటికీ మరువలేమమ్మా!



-పొత్తూరి జయలక్ష్మి
సెల్:9490233148

# రమ్య (మైన) నిర్ణయం
(కథ)

అమ్మా..!అమ్మా..! ఈరోజు మధ్యాహ్నం ఓట్లు అడగడానికి చాలామంది వచ్చి వెళ్లారమ్మా. నువ్వు నాన్న ఆఫీస్ కి వెళ్లారని చెప్పా. వాళ్లంతా కవర్లో డబ్బులు పెట్టి, ఏవో పేపర్లు ఇచ్చి వెళ్లారు. నేను డబ్బుల కవర్ వద్దని ఎంత చెప్పినా వినలేదు. నువ్ చిన్న పిల్లవి నీకు తెలియదులే. మేము మీ పేరెంట్స్ తో మట్లాడతాం లే అంటూ వెళ్లారు. తర్వాత ఇంకో ఆంటీ వచ్చి బొట్టు పెట్టి పాంప్లేట్ ఇచ్చి నేను మన కాలనీ అభివృద్ధి కోసం ఏం చేయాలనుకుంటున్నానో ఈ పేపర్లో ఉంది, అమ్మావాళ్ళు వచ్చాక ఇది ఇవ్వు. అది చదివాక వాళ్లకు నచ్చిన వాళ్లకు ఓటు వేయమని చెప్పమ్మా అని చెప్పి వెళ్లారు, అని వాళ్ళు ఇచ్చిన డబ్బుల కవర్లు మరియు పాంప్లెట్లు నా చేతిలో పెట్టింది ఏడవ తరగతి చదువుతోన్న మా అమ్మాయి రమ్య.

సరేలే అవి పక్కన పెట్టు, నాన్నగారు వచ్చాక మాట్లాడి డిసైడ్ అవుదాం అని చెప్పి నేను ఫ్రెష్ అయ్యి, కాఫీ కలిపే సరికి ఆయన వచ్చారు. ఇద్దరం కాఫీ తాగాక ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల గురించి మాట్లాడుకుంటూ..

డబ్బులు ఇచ్చిన వాళ్ళకి ఆ డబ్బు వెనక్కి ఇచ్చేస్తే, అంటే మీరు "మాకు ఓటు వేయద్దని నిర్ణయించుకున్నారా" అంటూ మోహమాటపెడతారు. ఇపుడు పెద్ద తలనొప్పి మనకు ఏం చేద్దాం అన్నాడు ఆయన. పాపకి తెలియక తీసుకుంది కదా ఎలా మరి అన్నాను. అపుడు రమ్య ఏంటి అమ్మా.. అలా తీసుకోవద్దా. సారీ మా అంది. పర్లేదులే చిన్ని, ఏం చేయాలో మేము ఆలోచిస్తాములే అన్నాను. అపుడు రమ్య అమ్మా మా స్కూల్ లో ఒక స్టోరీ చెప్పారు మా టీచర్. రాబిన్ హుడ్ డబ్బున్న వాళ్ళ దగ్గర లాక్కొచ్చి పెదవాళ్ళకి పంచి హీరో అయ్యాడట కదా. మనం కూడా ఒక పని చేద్దామా? వీళ్లకు ఎలాగో డబ్బులు ఎక్కువ అయ్యాయి అని ఇచ్చారు కదా. మనం ఆ డబ్బులు ఆర్ఫన్స్ కి ఇద్దామా అమ్మా అని అడిగింది. నేను మా వారు ఒక్కసారిగా ఆశ్చర్య పోయాం.ఇంత చిన్న దానికి ఎంత పెద్ద ఆలోచన అని. రమ్య గ్రేట్ రా నువ్వు. నీవు చెప్పినట్లే చేద్దాం. ఎలాగో వచ్చే నెలలో నీ పుట్టినరోజు ఉంది కదా ఆరోజు అనాధాశ్రమం లో పిల్లలకు ఏమైనా తీసుకెళ్లి, నీ చేత్తోనే ఇద్దాం ఈ డబ్బులతో ఓకే నా బంగారు తల్లి అన్నారు మా వారు

ఓకే నాన్నా ! మరి మీరిద్దరూ ఓటు ఎవరికి వేస్తారు అని అనుమానంగా అడిగింది పాప.

ఓటు కు నోటు ఇచ్చే వాళ్ళు ఎలా ఉంటారో , ఏం అభివృద్ధి పనులు చేస్తారో తెలియదు. కానీ తాము ఏమేమి పనులు చేయాలనుకుంటున్నారో చెప్పి ఆలోచించి ఓటు వేయమని చెప్పిన మంచి మనిషికి ఓటు వేసి గెలిపించుకోవడం మన బాధ్యత. అసలు డబ్బులు తీసుకోకూడదు మనము, వెనక్కి ఇవ్వలేము కాబట్టి, ఓట్టైనా సరైన అభ్యర్థి కి వేయాలి కదా ఏమంటావు శ్యామలా అంటూ నన్ను అడిగారు మా వారు. అంతే కదండీ, మంచి చేస్తారు అనే నమ్మకం ఉన్నవాళ్లకే ఓటు వేయాలి. అది మీరైనా, నేనైనా, ఇంకెవరైనా. ఆలోచించి ఓటు వేసి మంచిని గెలిపించుకోవాలి కదండీ అన్నాను నేను. మా చిన్ని కి ఏమి అర్థం అయ్యిందో గాని చక్కగా సంతోషంతో చప్పట్లు కొట్టింది.



-దేవలపల్లి సునంద
8297744716



ఫిబ్రవరి 13 ఫోనెల్స్ ఎరేనా ఆర్ట్స్ మరియు కల్చరల్ సెంటర్, హైదరాబాదులో మెగా రికార్డ్స్ క్రియేషన్స్ నిర్వహించిన గ్లోబల్ అవార్డ్స్ ప్రదానోత్సవ కార్యక్రమంలో అతిథులు గుదిబండి వెంకటరెడ్డి, డా॥ చిల్లా రాజశేఖర రెడ్డి, డా॥ రామరాజు శ్రీనివాసరావు, శ్రీమతి లక్ష్మి శ్రీనివాస్‌ల ద్వారా టీ.వీ. సీరియల్స్ కథలు, మాటల రచయిత మేపల్లి బాబా దంపతులు గ్లోబల్ అవార్డ్ స్వీకరిస్తున్న దృశ్యం. చిత్రంలో పి. శ్రీనివాసరావు, దార్ల నాగేశ్వరరావు.



విశాలాక్షి సాహిత్య మాస పత్రిక
కీ॥శే॥ గడీల నారాయణ స్మారక
ఉగాది మినీ కథల పోటీ



విశాలాక్షి సాహిత్య మాసపత్రిక, కీ.శే. గడీల నారాయణ స్మారకంగా ఉగాది సందర్భంగా మినీ కథల పోటీ పెడుతుంది.

- ఒక్కో కథకు రూ. 500రూ.
- పది కథలకు మాత్రమే బహుమతులు
- సాధారణ ప్రచురణకు కొన్ని తీసుకోబడతాయి
- కథలు చేరవలసిన చివరి తేదీ మార్చి 10
- కథలు విశాలాక్షి ఏప్రిల్ సంచికలో ప్రచురిస్తాము
- కథలు డిటిపి చేసిన Unicode (or) PMD format లో మాత్రమే
- మెయిల్‌కు పంపాలి
- కథలు DTP లో రెండు పేజీలకు మించరాదు.
- అంశం - నాన్న
- ఈ నాన్న అంశంనే కథా వస్తువుగా స్వీకరించాలి

కథలు పంపవలసిన మెయిల్
e-mail : visalakshi.poteelu@gmail.com
Cell : 9440529785




సభలో ప్రసంగిస్తున్న సిబిఐ మాజీ జే.డి. వి.వి. లక్ష్మీనారాయణ.




అక్షరయాన్ అధ్యక్షురాలు ఐనంపూడి శ్రీలక్ష్మి



అందరిచే ప్రతిజ్ఞ చేయిస్తున్న అతిథులు.

4వ పేజీ తరువాయి..

ప్రవీణ్‌శర్మ, తాళ్లపల్లి యాకమ్మను సత్కరించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ రావు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారు ఈ రోజు మాతృభాషా దినోత్సవం జరుపుకోవాలని అప్పుడే మనల్ని మనం గౌరవించుకున్నట్లు అవుతుందన్నారు. సి.బి.ఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అవధానం వంటి ప్రక్రియలు తెలుగులో కాకుండా మరే భాషలోనూ లేవని అన్నారు.

# మాతృభాషకు ద్రోహం జరుగుతున్నందుకు బాధగా ఉంది: డా॥ కేవీ రమణాచారి

మాతృభాషా దినోత్సవం నాడు.. అది ఎలా నిర్వహించుకుందాం అని మాట్లాడుకుందామా.. లేక మాతృభాషకు జరుగుతున్న ద్రోహం గురించి మాట్లాడుకుందాం.. అనే స్థితిలో నేనున్నా.. ఎందుకంటే ప్రభుత్వంలో నేను భాగస్వామిని కనుక. తెలుగంటే ఇష్టపడే వారు చాలా మంది ఉన్నా విధానపరమైన నిర్ణయాలు తీసుకునేవారిలో అది లోపిస్తోంది. ఎందుకో అధికార భాషా సంఘం కుంటి నడక నడుస్తోంది. మాతృభాష కోసం చేయడానికి ఎంతో ఉన్నా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏం చేయడం లేదు. తెలుగంటే బాగా ఇష్టపడే గౌరవనీయులు, తెలుగులో ఎమ్మే చేసిన గౌరవనీయులు, తెలంగాణ ఏర్పడగానే రెండవ సంవత్సరంలో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించడం ప్రపంచమంతా ఉండే తెలుగువారికి అది ఏమి పద్యాలాపన, ఏమి ఉపన్యాసం అని అందరితో కొనియాడబడ్డ ప్రభుత్వంలో కూడా తెలుగుకు కావాల్సిన ముందుంజ లేకపోవడం దురదృష్టకరం, తెలుగు గురించి బాగా పట్టించుకుని ఎంతో చేయడానికి అవకాశం ఉందని ఆశించిన వారికి కూడా సంవత్సరాలు గడుస్తూనే ఉన్నాయి. మళ్లీ సంవత్సరం అయితే ఎన్నికలు వస్తాయి అప్పుడు మాతృభాష గూర్చి పట్టించుకుంటున్నామంటే నమ్మాలా.. నమ్మకూడదా.. అన్న విషయాన్ని నేనే వదిలేస్తున్నా.. గత సంవత్సరం మాతృభాష దినోత్సవం రోజు నాకు విద్యాసాగర్‌రావు సన్మానం చేస్తే పద్మశ్రీ వచ్చినట్లు ఆనందించా. కానీ, నేను ప్రభుత్వ సలహాదారునిగా ఉండి మరింత చెప్పేందుకు సత్కరించి ఉంటే అందులో నేను ఓడిపోయి ఉంటే ఆయనకు నమస్కారం చేస్తున్నా. సలహాదారు అంటే.. అడిగితేనే సలహాలు ఇవ్వాలని, అడగపోతే సలహాలు ఇవ్వకూడదని కానీ అడిగేవారెవరు ఈ కాలంల..' అని అన్నారు.

**అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా తెలుగు భాషకు సేవచేసిన పలువురు భాషాభిమానులకు సత్కారం..**



శ్రీ షేక్ బడేసాబ్ – తెలుగు భాషా ప్రచారకర్త
డా॥ తాళ్లపల్లి యాకమ్మ – రచనా విభాగం



తిరుమల శ్రీనివాసా ఆర్య – భారతీయ సంస్కృతీ వికాసం
డా॥ షేక్ హాసీనా – పత్రికారంగ వికాసం
శ్రీ ప్రవీణ్ శర్మ – విద్యార్థుల్లో శతక సాహిత్య ప్రోత్సాహక కర్త

మా హసన్ బీ (తల్లి) పేరుతో తెలుగు వాచకం రూపకర్త..తెలుగు భాష అభివృద్ధి కోసం నాలుగు దశాబ్దాలుగా సేవ చేస్తున్న **షేక్ బడే సాహెబ్**గారికి,

రాజకీయ రంగంలో స్త్రీలు అనే అంశం మీద ఆరు పుస్తకాలు రాసి జాతీయ,అంతర్జాతీయ పత్ర సమర్పణలతో పాటు పలు విశ్వ విద్యాలయాల్లో గెస్ట్ ఫ్యాకల్టీ లెక్చరర్‌గా పనిచేస్తూ ఒక ఛానెల్ లో న్యూస్ ఎడిటర్‌గా అనుభవం సాధించిన జర్నలిస్టు **అతీషేక్** హసీనాగారికి,

బోయ జంగయ్య రచనల మీద phd చేసిన రచయిత్రి..చదువుకునేందుకు ఎంతో పోరాటం చేసి దళిత సామాజిక వర్గంలో తెలుగు భాషాభివృద్ధి కోసం పాటుపడుతూ 6 సాహిత్య పుస్తకాలు రాసిన "కెరటం"... నవలతో తెలుగు సాహిత్యంలో కొత్త ఒరవడి తెచ్చిన **డా॥తాళ్లపల్లి యాకమ్మ**గారికి,

వృత్తి క్షవరసాల.. ప్రవృత్తి వైదికం..నిత్యాగ్ని హోత్రం..భారతీయ సంస్కృతిని పెంపొందింస్తూ ..2013 నుండి 100 విద్యాసంస్థల్లో నెల నెల కవితా యజ్ఞం పేరుతో చిన్న పదాలతో కవిత్వం పట్ల విద్యార్థుల్లో ఆసక్తి కలిగిస్తూ సాహితీ యజ్ఞం చేస్తూనే "నుడుగు పిడుగులు" ఉద్యమ కవితా సంకలనాన్ని అందించిన ఆశుకవి **తిరుమల శ్రీనివాస్ ఆర్య** గారికి,

తెలుగు ఉపాధ్యాయుడిగా పిల్లలకి వ్యాకరణం పట్ల..భాష పట్ల పట్టుని పెంచి పిల్లలతో 4 శతకాలు రాయించిన తెలుగు భాషార్చకులు..పద్యకవి **ప్రవీణ్ శర్మ**గారికి జ్ఞాపికా, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

**ఈ సభలో ఈ క్రింది పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. మరియు రచయిత్రి గురించి పుస్తకం గురించి వివరాలు..**

1.'ఎద సవ్వడి' పుస్తక రచయిత్రి **శ్రీమతి యలమర్తి అనూరాధ** గత 47 సంవత్సరాలుగా సాహితీ సేద్యం చేస్తూ 5 నవలలు, 200ల కథలు, 500ల కవితలు , 500ల వ్యాసాలతో ప్రతి రచనా ప్రక్రియలోనూ తనదైన ప్రతిభను కనబరిచి 6 పుస్తక ఫలాలను అందించారు. ఉత్తమ సాహితీ అవార్డు, గుర్రం జాషువా, రావూరి భరద్వాజ వంటి ఎన్నో సాహితీ అవార్డులను, పురస్కారాలను సొంతం చేసుకున్నారు. ఆకాశవాణి మరియు దూరదర్శన్‌లకు ముఖ్యఅతిథిగా, వక్తగా చిరపరిచితురాలు. మారుతున్న తరాలకు అనుగుణంగా వీరి రచనలు సాగుతుంటాయి.

మనసు పలికిన కవితలు. కాదేదీ కవితకు అనర్హం అన్నట్లు రచయిత్రి కలం నుంచి జాలు వారిన అక్షర పుష్పాలు. సమాజానికి అద్దం పడుతూ సామాజిక




స్పృహను కల్పించేవి.పలువురు సాహితీ ప్రముఖుల ప్రసంశలు పొందినవి.

**2. 'మైండ్ ఎ మెరాకిల్'** రచయిత్రి **తమిరిశ జానకి** రచనా వ్యాసంగం మొదలుపెట్టి అరవైసంవత్సరాలు పూర్తి అయ్యింది. వివాహానికి ముందు వై.జె.అనే పేరుతో రాసేవారు. వివిధ పత్రికల్లో ఇప్పటివరకూ సుమారు 350--400




వరకూ వచ్చాయి. 16 నవలలు 250 కవితలు వ్రాసారు. హైద్రాబాద్ తెలుగు విశ్వవిద్యాలయం వారినుండి రెండుసార్లు పురస్కారాలు అందుకున్నారు. మద్రాసు కేసరి కుటీరం వారు స్వర్ణ కంకణంతో సత్కరించారు. అమెరికా , కెనడాలలో కూడా సన్మానాలు జరిగాయి.

మనసు స్పందించి కథలు రాసినట్లే, కవితలు కూడా రాయడం జరుగుతూ ఉంటుంది. ప్రస్తుతం కొన్నింటిని ఆంగ్లంలోకి అనుసృజన చేయించారు. పుస్తకంలోని కవితలు అన్నీ కూడా సమాజానికి మంచి సందేశాన్ని అందిస్తూ పాఠకుల ఆలోచనా దృక్పధాన్ని విస్తృత పరిచేవిగా ఉంటాయి.

**3. "ఎబిలిటి ఇన్ డిజెబిలిటి"** పుస్తక రచయిత్రి **డా.గురజాడ శోభాపేరిందేవి** వయోధికుల సమస్యలపై పీహెచ్డీ చేసి ,వారికోసం న్యాయ పోరాటం చేస్తున్న రచయిత్రి. సోషల్ జెరొంటోలజిస్ట్ అయిన వీరు పెద్దలపై విభిన్న స్ఫూర్తిమంతమైన పరిశోధనాత్మక పుస్తకాలు రాసారు. సీనియర్స్ సెర్వింగ్ సీనియర్స్ సంస్థని ప్రారంభించి ,బబబ బలివవబి 60 అనే యూట్యూబ్ ఛానల్ ద్వారా వారి కళలూ కలలూ,ఆశలూ ఆశయాలను ప్రోత్సహిస్తున్నారు .దివ్యాంగ్గుల కై కలంతోనూ నూ కరంతోనూ ఫూతం అందిస్తున్నారు. వీరి పుస్తకాలు 13 అచ్చై కొన్ని అవార్డులు సైతం అందుకున్నాయి.

వైకల్యం.. వ్యక్తి పురోగతికి ఎన్నడూ అవరోధం కాదని, కృషితో దివ్యాంగ్గులు ఆకాశం హద్దుగా విజయకేతనాన్ని ఎగురవేయగలరని నిరూపించిన తొమ్మిది కథలు' వైకల్యాన్ని అధిగమిద్దాం' అనే పేరుతో మొట్టమొదటి దివ్యాంగ్గుల తెలుగు కథల సంపుటిగా మొదట అచ్చైంది. ప్రస్తుత పుస్తకం దాని ఆంగ్ల అనువాదం. ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఆశించకుండా ఏమైనా చేయగలమనే ధీమా, వెక్కిరింతలని, వ్యంగ్యాస్త్రాలనీ ఛాలెంజీలుగా తీసుకుని చెయ్యెత్తి జైకొట్టించుకోగల సత్తా ను సూచించిన కథల సంపుటి ఇది.

**4. సుపథ శతకం** పుస్తక రచయిత్రి **సి.హెచ్.రజిత** జెడ్. పి. హెచ్. స్కూల్ , పెద్దపల్లి లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు.వీరి కలం పేరు జాహ్నవి. వీరి రచనా వ్యాసంగానికి గానూ పలు పురస్కారాలను వాగ్దేవి, జ్ఞానతేజ వంటి బిరుదులను పొందారు.'సుపథ శతకము' వీరి తొలి శతకము. సమాజాన్ని , యువతను, విద్యార్థులను మేల్కొలిపే విధంగా నైతికవిలువలను తెలుపుతూ, సుగుణాలను పెంపొందింప జేసే విధంగా " రాజమార్గమౌను రజిత పథము" అనే మకుటంతో నడుస్తుంది.

**5. "మరీచిక"** పుస్తక రచయిత్రి **యస్.వి.కృష్ణజయంతి** సాహిత్యంలోని దాదాపు అన్ని ప్రక్రియలలోనూ వీరి రచనలు సాగాయి. పత్రికలలో ప్రచురితం అయ్యాయి. రేడియో-దూరదర్శన్‌లలో ప్రసారమయ్యి బహుమతులు గెలుచుకున్నాయి. వీరి రచనలపై పరిశోధనలు కావింపబడ్డాయి. వీరు సాహిత్యంలో భారతప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వశాఖ వారి ఫెలోషిప్ పొందిన తొలితెలుగు రచయిత్రి. కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగుతున్న "ఇండియన్ సొసైటీ ఆఫ్ ఆథర్స్ (ఎనిం) కు రెండు తెలుగురాష్ట్రాల తరపున సమన్వయకర్తగా ఉన్నారు.

అన్ని రంగాలలోనూ పురుషుడితో సమానంగా స్త్రీలు పురోగమిస్తున్న సమకాలీన పరిస్థితులలో శారీరక-మానసిక-బాహ్యాంతర్గత అంశాలలో భావోద్వేగపరంగా సున్నితంగా, సుకుమారంగా ఉంటూ... పురుషుడితో విభిన్నంగా ఆలోచించే స్త్రీ హృదయాంతర్గత భావావిష్కరణకి ఆస్కారం కల్పించే "ఆత్మాశ్రయ కవిత్వ" ధోరణిలో వెలువడిన తొలికవితాసంపుటి "మరీచిక".

**6. "వాసుదేవ శతకము"** పుస్తక రచయిత్రి **సారంగపుర్కర్ సుమతి:** నిర్మల్ లో ఉంటారు.ఎం.ఏ ఎకనామిక్స్, ఎం.ఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ చేసారు. గృహిణిగా ఉంటూనే తన అభిరుచులైన పుస్తక పఠనం, సమాజసేవ చేస్తుంటారు. ప్రస్తుత పుస్తకం "వందనాలుతండ్రి వాసుదేవ"శతక పద్యాల రూపంలో రచించారు. తనను కని,పెంచి , ప్రకృతిపట్ల ,సమాజం పట్ల, పెద్దవారి పట్ల ఎలా బాధ్యతగావుండాలో నేర్పించిన వారి నాన్న గారి పేరుతో...అవే విషయాలను తన పుస్తకం ద్వారా నేటి తరం పిల్లలకు ,పెద్దలకు చెప్పే ప్రయత్నం చేసారు.

**7."మెలకువ చిగురించిన వేళ"** పుస్తక రచయిత్రి **ఉరిమళ్ళ సునంద** పదవతరగతి పూర్తి కాగానే వివాహం జరిగింది. భర్త భోగోజు ఉపేందర్ రావు సహకారంతో చదువుకుని ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు.ప్రస్తుతం ఖమ్మం జిల్లా బోనకల్ మండలం కలకోట ఉన్నత పాఠశాలలో తెలుగు భాషోపాధ్యాయిని గా పని చేస్తున్నారు.

తెలంగాణ రాష్ట్ర పాఠ్య పుస్తకాల రూపకల్పన, డిజిటల్ పాఠాలు చెప్పడంలో రిసోర్స్ పర్సన్ గా పని చేస్తున్నారు. ప్రవృత్తి రీత్యా వీరు కవయిత్రి, రచయిత్రి.. ఇంతకు ముందు ఒక కవితా సంపుటి ని, బాలగేయాల సంపుటి ని, కథా సంపుటి ని అందించారు. తాను పని చేసే పాఠశాల విద్యార్థులతో చిరు ఆశల హరివిల్లు, ఆళ్ళపాడు అంకురాలు అనే బాలల కవితల సంకలనాలు,పూల సింగిడి,కలకోట కథా సుమాలు అనే బాలల కథల సంకలనాలు తీసుకొచ్చారు.సామాజిక అంశాలతో కూడిన 'మెలకువ చిగురించిన వేళ' అనే కవితా సంపుటి.

**8. "తొలకరి మెరుపులు"** పుస్తక రచయిత్రి **జి.శాంతారెడ్డి** తండ్రి తెలుగు లెక్చరర్ కావడంతో వారి భాషభిమానాన్ని వారసత్వ సంపదను అందిపుచ్చుకొని ప్రభుత్వ న్యూటౌన్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయినిగా సేవలనందిస్తున్నారు.

ప్రవృత్తి రీత్యా వీరు కవయిత్రి, అక్షరయాన్ సంస్థ మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి . మొదట మౌన గీతం కవిత్వం, తర్వాత అమ్మా నాన్న ద్విశతినీ అందించారు.మెరుపులు అనే నూతన ప్రక్రియలో తొలి సంపుటిని వివిధ సామాజిక సమకాలీన అంశాలతో "తొలకరి మెరపులు"గా మన ముందుకు తీసుకువచ్చారు.

9. **"అష్టవిధ నాయికలు"** పుస్తక రచయిత్రి **జ్యోతి వలబోజు** తెలుగు బ్లాగర్గా, రైటర్గా, కుకరీ ఎక్స్పర్ట్‌గా, పత్రిక సంపాదకురాలుగా, ప్రచురణకర్తగా వీరు అందరికీ సుపరిచితురాలు. జె.వి.పబ్లికేషన్స్ ద్వారా దాదాపు 200 పుస్తకాల ప్రచురణ చేసారు. మహిళా ప్రచురణకర్తగా 2019 లో తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం విశిష్ట మహిళ పురస్కారం అందుకున్నారు. కావ్య సంపుటిలో ప్రస్తుతం 'అష్టవిధ నాయికలు' 65మంది పద్యకవులు, ప్రేమికులు కలిసి సామాజిక మాధ్యమం వేదికగా అష్టవిధములైన నాయికల తీరుతెన్నులపై రాసిన పద్యాలు. ఇందులో తెలుగు రాష్ట్రాల కవులే కాక ఇతర రాష్ట్రాల, దేశాల వారు కూడా ఉన్నారు.

**10."మేల్బంతి మౌక్తికాలు"** పుస్తక రచయిత్రి **బొమ్ము విమల** జిల్లా పరిషత్ హైస్కూల్ కొల్లూర్ లో తెలుగు ఉపాధ్యాయుని గా పని చేస్తున్నారు.స్వతహాగా మాతృభాషాభిమాని ఐన వీరు పద్యాలు,బుర్ర కథలు,వచన కవితలు వంటి అనేక ప్రక్రియలలో రచనా వ్యాసాంగాన్ని కొనసాగిస్తున్నారు.

అనేక సాహితీ సంస్థల నుండి సన్మానాలు, పురస్కారాలు పొందారు.

దాదాపు 40 సంకలనాలలో వీరి కవితలు ముద్రించడం జరిగినది. ముద్రిత పుస్తకమైన "విమల మణి పూసలు" అనే పుస్తకానికి వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ లో స్థానం పొందినది.

'మేల్బంతి మౌక్తికాలు' వారికెంతో ఇష్టమైన ఇష్టపది ప్రక్రియలో వ్రాసారు.

ఈ పద్యాలు సీస పద్యాలను పోలి పది మాత్రలను కలిగి రెండు భాగాలుగా అది ప్రాసతో పాడుకోవడానికి వీలుగా శ్రీ కృష్ణుని నామ ముద్రతో విమల మదిలో మాట విన్నవించెద కృష్ణా! అనే మకుటంతో ఉంటాయి.

**11. "అక్షరసేద్యం (కైతిక ప్రక్రియ)** పుస్తక రచయిత్రి **ఐరేణి కృష్ణవేణి** తెలుగు భాషోపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. విద్యార్థి దశలో స్పందించి ఆగిపోయిన వీరి కలం వీరి భర్త ప్రోత్సాహంతో ఇప్పుడిప్పుడే మరలా సాహిత్యం వైపు అడుగులు వేస్తుంది.

బాలగేయాలు మరియు నాలుగు వందల పై చిలుకు వచన కవితలు రాశారు.

పలు సాహితీ సంస్థల నుండి ప్రశంసా పత్రాలను అందుకున్నారు.

గోస్కుల రమేష్ గారి ప్రోత్సాహంతో వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ కోసం కైతిక ప్రక్రియలో సాగిన మొదటి రచన ఈ 'అక్షర సేద్యం'. ప్రస్తుత సమాజంలోని సమస్యలకు స్పందిస్తూ,

అన్ని కోణాలను స్పృశిస్తూ మనకు అందించారు.

**12. 13. "శ్రీరామ గానామృతం", స్వరాజ్యవాణి"** పుస్తక రచయిత్రి **కొల్లూరు స్వరాజ్యం వేంకట రమణమ్మ** మన దేశానికి స్వరాజ్యం సిద్ధించిన రోజున జన్మించారు. బాల్యం నుండి తెలుగు భాషపై మక్కువ కలిగిన వీరు ఆరవ తరగతి నుండే రచనలు చేయడం ప్రారంభించి నేటికీ కొనసాగిస్తున్నారు. రైల్వే పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పదవీ విరమణ చేశారు. భావితరాల్లో మాతృభాషను మరింతగా అభివృద్ధి చేయాలనే తపనతో 'బాలబాట' అనే పిల్లల మాస పత్రికను ప్రారంభించారు. వీరి సేవలను గుర్తించి పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం వారు.. బాల సాహిత్యంలో విశిష్ట పురస్కారాన్ని అందించారు. భారతీయ రైల్వే వారి ద్వారా ఉత్తమ ఉపాధ్యాయురాలిగానూ, సమాజ సేవ అవార్డులను పలుమార్లు అందుకున్నారు. వీరు బాల సాహిత్యం, ప్రౌఢ సాహిత్యం, భక్తి సాహిత్యంలో 52 పుస్తకాలను రచించారు. సాహితీసుధ ,తెలుగు భాషా భూషణ్, సాహిత్య రత్న వంటి అనేక బిరుదులను పొందారు. 74 సంవత్సరాల ప్రాయంలో కూడా వీరు చేస్తున్న తెలుగుభాషా సేవ.. నేటి బాలల సర్వతోముఖాభివృద్ధికి చేస్తున్న కృషి మెచ్చుకోదగినది.

**14." ఇట్లు కరోనా"** పుస్తక రచయిత్రి **ఐనంపూడి శ్రీలక్ష్మి** గత 4 దశాబ్దాలుగా సాహితీ సేవ చేస్తున్నారు..11 పుస్తకాలు రాశారు..50 పైగా పుస్తకాలకి సంపాదకులుగా ఉన్నారు. రాష్ట్ర గవర్నర్ డా. తమిలసై సౌందర్యరాజన్ గారు 2020లో రాజ్‌భవన్‌లో అవిష్కరించిన కొత్త ప్రేమలేఖలు పుస్తకం విశేష ఆదరణ పొందింది.. కవిత్వమే ఓ గెలాక్సీ వీరి కవితానుభవదర్శిని..

ఈ 'ఇట్లు కరోనా ' పుస్తకం లేఖా సాహిత్యం..మనిషికి కరోనా ఉత్తరం రాస్తే ఏమి చెపుతుంది అన్నది దీంట్లో ని అంశం..100 పేజీల ఈ పుస్తకం భవిషత్ తరాలకు మార్గదర్శిగా నిలబడి ఆరోగ్య సమాజ పునర్నిర్మాణానికి ఎలా దారి చూపించగలదో తెలిపే 100 పేజీల పుస్తకం ఇది.

ఆకాశవాణిలో 30 ఏళ్లుగా పనిచేస్తున్న చేయి తిరిగిన కళా కారిని మరియు చెవులొగ్గి వినాలి అనిపించే గళా కారిణి కూడా.

అక్షరయాన్ సంస్థ అధ్యక్షురాలిగా 700 మందికి పైగా తెలుగు రచయిత్రులను ఒక్క తాటిపై తెచ్చిన కృషీవలురాలు.

ఎంతో మంది కవయిత్రులు, రచయిత్రులు పాల్గొన్న సభ ఘనంగా జరిగింది.

























ప్రముఖ కవి, రచయిత, విమర్శకుడు
కీ॥శే॥ ద్వా.నా.శాస్త్రి సంస్మరణ సభ సందర్భంగా
కిన్నెర, ద్వానా కుటీరం, 'నేటినిజం' దినపత్రిక సంయుక్తాధ్వర్యంలో

# "నాన్న" అంశంపై నిర్వహించిన కవితల పోటీ ఫలితాలు

* మొదటి బహుమతి: రూ. 5,000/–లు నగదు, ప్రశంసాపత్రము
"నాన్నకు నేనేమివ్వగలను" – కమలేశ్, సెల్: 9160396596
* రెండవ బహుమతి: రూ. 3,000/–లు నగదు, ప్రశంసాపత్రము
"నన్ను క్షమిస్తావా నాన్న!" – చొక్కాపు లక్ష్మునాయుడు, 9573250528
* మూడవ బహుమతి: రూ. 1,000/–లు, నగదు, ప్రశంసా పత్రము
"నీ జ్ఞాపకాల నీడలో" – కటుకోజ్వల రమేశ్, 99490 83327

ప్రోత్సాహక బహుమతులు: ఒక్కొక్కరికి రూ. 500/–లు నగదు, ప్రశంసా పత్రము
• 'నాన్న' – రెడ్డి రమాదేవి, సెల్: 8008531677
• 'ఎంత సూక్ష్మం నాన్నా మీరు'– వెంకటేశ్ పువ్వాడ, సెల్: 7204709732
• 'నాన్న' –మరుగొండ సాయిలు, సెల్: 99488 96953
• 'చైతన్య స్ఫూర్తి నాన్న'– బి. కళాగోపాల్, సెల్: 94416 31029
• 'నాన్నా! నేనంటే నువ్వే!!'– చిట్టేల శ్రీధర్ కుమార్, సెల్: 8985052188

ఈ కవితల పోటీలో వందకుపైగా కవులు కవయిత్రులు పాల్గొన్నారు. అందరికీ అభినందనలు. న్యాయ నిర్ణేతగా కవయిత్రి, రచయిత్రి శ్రీమతి శైలజామిత్ర వ్యవహరించారు. విజేతలకు శుభాకాంక్షలు.

– బైస దేవదాసు
సంపాదకులు: నేటినిజం దినపత్రిక



## నాన్నకు నేనేమివ్వగలను

కష్టాలకు రెక్కలను ఎరవేసి
దుఃఖాన్ని పంటి బిగువున దాచేసి
తలమీద పేదరికం తాండవిస్తున్నా
అధైర్యాన్ని గుండెలోకి చొరబడనివ్వకుండా
కొడుకు అడిగినవన్నీ కొనివ్వాలని
పరితపించే ప్రేమపాశం నాన్న.

ఎడమభుజం మీద పరువును
కుడిభుజం మీద కుటుంబ భారాన్ని మోస్తూ
కన్నీటి ప్రదర్శనకు కాసింతైనా చోటివ్వకుండా
ఉషస్సులా నిత్యం వెలిగే ఉత్తమ సంసారయాత్రికుడు నాన్న.

నాన్న చిటికెనవేలు నాకు నడకనేర్పి
నాలో ఆత్మస్థైర్యాన్ని నింపితే
చూపుడు వేలు బ్రతుకుబండిని నడపడం
నేర్పిన గురువయ్యింది
చిన్నప్పుడు నాతో ఆడుకున్న ఆటల్లో
ఆయన చిన్ని మనసు ఓడిపోయి నన్ను గెలిపించింది.

ఇక.. నాన్నా అనే పిలుపు మీది హక్కులన్నీ
తనకు రాసిచ్చినంత మాత్రాన, తన పేరు మీది
యావదాస్తులన్నీ నాకు రాసిచ్చిన
అమాయకపు చక్రవర్తి నాన్న.
ఎర్రటి ఎండ ఉమిసిన నిప్పులగుండం మీదుగా
నీ ప్రయాణం ఎన్ని కాలాలు కొనసాగిందో నన్నెత్తుకుని
బుగ్గలొచ్చినా భూతల్లిని తులనాడకుండా
చెమటలొచ్చినా సూర్యున్ని నిందించకుండా..

మరి నా కోసం ఇంత చేసిన నాన్నకు నేనేమివ్వగలను..?
తనువును హత్తుకోగానే తడిసిపోయేంత ప్రేమపుట్టే
ఈ "పుత్రగాత్ర పరిష్వంగం"లో
పులకించమని కోరడం తప్ప.



– కమలేశ్
సెల్: 9160396596

## చైతన్య స్ఫూర్తి నాన్న..!!

నడకను నేర్పించి.. నడతను తీర్చిదిద్ది
నలుగురిని నీతో నడిపించమనే ప్రోత్సాహానికి
ఆదిగురువు నాన్న!
భుజాలపై మోసిన బిడ్డల గెలుపుకు మురిసిపోతూ
తప్పు చేయనివ్వని ఆరాటంలో ఆవేశం చూపించినా..
మందలింపు మాటల మాటున దాగిన అమృతంలాంటి
అవ్యాజ్య ప్రేమానురాగాల చిరుజల్లు నాన్న!
బాల్యమనే తొలిమెట్టుపై మనలను నిటారుగా నిలబెట్టి
తన జీవన సూక్తులతో మార్గదర్శకత్వం వహిస్తూ..
సత్తువ సన్నగిల్లుతున్నా సహనం కోల్పోని
అస్తమిస్తున్న సూరీడు నాన్న!
అంతరంగంలో ఎన్ని విషాద సుడిగుండాలున్నా
చెరగని చిరునవ్వుతో..
దూరాభారమైనా.. బరువు బాధ్యతలోనయినా
నీ వెంట నేనున్నాననే ఆత్మస్థైర్యపు చిరునామా నాన్న!
కష్టాలెన్ని ఎదురైనా.. సంతోషం దరిచేరకున్నా
కోరిన కలలను సాకారపర్చే విజయపు కొవ్వొత్తిలా..
తన మదిపొరల కదలికలు తెలియనీయని గాంభీర్యంతో
ఓపిక లేకున్నా ఓదార్పు ఎరుగని బాటసారి నాన్న!
మనలోని నైరాశ్యపు దిగులు గుహలను తుదముట్టించి
భుజం తట్టే భరోసా వాక్యాల ఊతమిస్తూ.
ఆటుపోట్లను అధిగమించే దిశానిర్దేశపు చుక్కాని నాన్న!
కన్నీటిని దరిచేర్చనీయని జ్ఞాపకాల చెలిమెగా..
క్రమశిక్షణకు మారుపేరైన బంధంగా..
ఋణం తీర్చుకోలేని దేవుడు నాన్న!!



– బి. కళాగోపాల్
సెల్: 94941631029

## నాన్న

సీ.ప. కన్ను దెరిసినట్టి చిన్ని పాపను జూసి
మదినిండ మురిసేటి మమత నాన్న
బోసినవ్వులలోన బాసలెన్నో జూసి
పులకించి నుప్పొంగు వలపు నాన్న
ఎగిరి యెగిరి దూకి యెదపైన తన్నేటి
బంగారు బాలల భవిత నాన్న
పడిలేచి నడిసేటి పసిపాప దరిజేరి
తడబాటు దిద్దేటి తపన నాన్న.

తే.గీ. తనదు ప్రతిబింబ రూపమై తరలివచ్చి
ఇంటజేరిన మురిపాల పంటయైన
పిల్ల పాపకు తండ్రియు నెల్లవేళ
కల్ల కపటమ్ము లేనట్టి కల్పతరువు.

సీ.స. పాత గుడ్డను నాన్న పట్టుగాదల పోసి
కొత్తవి బిడ్డకు కొనగనెంచు
పగలు రాత్రియు నాన్న పస్తులుండియునైన
బిడ్డ కడుపునింపు దొడ్డ మనిషి
తనయులు కష్టించ తల్లడిల్లును దండ్రి
పేగు బంధములోని పేర్మిజేత
తనకంటే ఘనముగా తనయులు నెదిగిన
సంతసమ్మందేటి వింత మనిషి.

తే.గీ. భార్య పిల్లలన్ బంధాన బందీయయ్యి
తనది తానను స్వార్థమ్ము తరిమివేసి
కాయకష్టమ్ము కాజేసి కడుపు మాడ్చి
పిల్ల క్షేమమ్ము గోరేటి మల్లె మనసు



– మారుగొండ సాయిలు
సెల్: 9948896953

## నాన్నా! నేనంటే నువ్వే!!

నాన్నవాద సాహిత్యం నడుస్తోంది నవ్యతగా
నయగారపు దయావృష్టి! భద్రం తడుస్తావు నాన్న!!
విశ్వజనీనం కానిదీ.. 'వర్గ'వాద సానుభూతి
అప్పటి కాకాలపు 'గాలే'గాని, కలకాలపు కవిత కాదు!
మీకు తెలియని భావప్రకటనలా?
మీరెఱుగని భాషా పాటవమా?
యుగకర్తలు మీరు– 'యావ'కర్తలం మేము.
వ్యక్తిగత ఏక కేంద్ర వలయాల్లో..కీర్తిబిలాల్లో
కుచించుకుపోయి.పిల్లలని స్వేచ్ఛగా వదిలేసిన
నేటి నాన్నలు గుర్తింపు గవాక్షాలను అన్వేషిస్తూ
నాన్న వాదాన్ని సృష్టించుకు 'తృప్తి' పడుతున్నారు
స్వీయ నియంత్రణ పాటించి
బాధ్యతలని బరువనుకోని తరం మీది!
మీయునికి మాపై ముద్రించిన మీ నమ్మకమది.
నీముద్ర నానుండి ఎలా విడివడుతుంది నాన్నా?
నువ్వంటేనే భయం నాకిప్పటికీ..
సరదా సావాసాల మధ్యలోనున్నా–
సినిమా–షికారుల మత్తులోనున్నా
నీ కెదురయ్యే క్షణం తలచి కలవరపడేవాడిని.
సా..గే..సమయాన్ని ఆపి సమయపాలన నేర్పావు
వృధాలేని వినియోగం విశదీకరించావు
విత్తమూ..విద్యుత్తు, నీరూ–కన్నీరు
మాత్రమే కాదు–మనసు–మాటలూ కూడా!!
నేనంటే నేను మాత్రమే కాదు
నవ్వీకరింపబడ్డ నువ్వే కదా!!



– చిట్టేల శ్రీధర కుమార్
సెల్: 8985052188

## నన్ను క్షమిస్తావా నాన్నా!

ఒక సుదీర్ఘ విరామం తర్వాత..
ఇప్పుడీ ఎడారి గుండెకు ఏమయ్యిందో
తడి తడిగా ద్రవించిపోతుంది!
అనుక్షణం చూపులకు అడ్డం పడుతూ
కన్నీటి తెరలలోంచి మసక మసకగా
మూల రూపం దృశ్యమానమౌతూనే ఉంది!
అనంత నిర్లక్ష్యపు నిశీధిలో
చలువ చేతి చిటికెన వేలు విడిచి
రాళ్ళ దారుల్లోకి మళ్ళిన చీకటి క్షణాలు గుర్తొచ్చి
హృదయం కకావికలం అవుతూనే ఉంది!
మా బ్రతుకు మొక్క మొదళ్లను ముద్దాడేందుకు
కష్టాల కావిళ్ళ నిండా మమతల మంత్రజలాన్ని మోసుకొచ్చి
ప్రాణం నిలిపిన నీ బాధ్యతల భుజంపై
విల్లులా వంగిన కావిడిబద్దను కళ్ళకద్దుకొని
చేతి కర్రలమై సేవ చేయాలనే కోరిక
ఈ కట్టెనిప్పుడు సలుపుతూనే ఉంది!
కోడినిద్రతో రాత్రుళ్ళను తెల్లార్చి
ఎర్రెర్రని పగళ్ళను పని సమ్మెటతో మోది
జీవితపు పగుళ్ళను స్వేదంతో పూడ్చిన
ఆ తడిదేహాన్ని హత్తుకొని
కన్నీటి ప్రవాహమై నీ పాద పద్మాలపై ప్రవహించే వరకూ
బ్రహ్మజెముడై గుచ్చుతున్న
అపరాధభావన
అణువంతైనా తొలిగేలా లేదు.



– చొక్కాపు లక్ష్మునాయుడు
సెల్: 9573250528

## ఎంత సూక్ష్మం నాన్నా మీరు

నవమాసాలు మోసి కన్నది అమ్మే!
కానీ ఆ అమ్మనీ నన్నూ మోసిందీ మోస్తుందీ
మీరే కదా నాన్నా!
అమ్మ చెప్పేదాకా తెలుసుకోలేకపోయా అంతరం
శిఖరంలాంటి మీ కీర్తి
ఎంత సూక్ష్మంలో కనుమరుగయింది నాన్నా!

నా తొలినాళ్ళ హీరోవి
మలితరం మహర్షివి
నాకింకా గుర్తుంది మెడ వంపులను నిమిరి
మీరిచ్చిన ధైర్యం ఇంకా అలానే ఉంది నాన్నా
నన్నో సైనికున్ని చేసింది.

ఎన్నో ఈతిబాధల రాత్రులని మింగేసి
పున్నమినాటి చంద్రుడిలా వెలిగిపోతారని
అందరికీ వెలుగునిస్తారని
ఎంత సూక్ష్మం నాన్నా మీరూ!.

చూడటానికి మీరు కఠినమే గానీ
మా కన్నీళ్లన్నీ మింగేసి ఘనీభవించిన
ఒక సముద్రాన్ని మోస్తున్న రౌద్రమని
అది తడిమితే ప్రేమై ప్రవహిస్తుందని
తాకేదాకా తెలీలేదు.

అన్నీ వయసుతో తెలుస్తున్నాయి నాన్నా!
ఇన్నాళ్లూ ఏ కిరీటాలు ఆశించని అజ్ఞాత కిరీటి
మీరని
అర్థం చేసుకోనందుకు మనసు భారంగా ఉంది
ఎంత సూక్ష్మంలో తెరమరుగయ్యావు నాన్నా!

ఎప్పుడైనా మీ మనసు కష్టపెట్టివుంటే
క్షమించండి నాన్నా!
ఇంకా చెప్పాలని ఉంది
ఎంత సూక్ష్మం నాన్నా మీరు !??



–వెంకటేష్ పువ్వాడ
7204709732

## నాన్న

ఆటల ప్రపంచంలో ఆదమరచి
సాయంత్రపు పొద్దునై తప్పిపోయినపుడు

లోకాన్ని చూపుల జల్లెడ పట్టి
అలసట పరిమళాన్ని అలవోకగా పసిగట్టి
పాలదేహాన్ని పూల కావడిలా భుజానికెత్తి
కలల వీధుల్లో జోకొట్టి నిద్రపుచ్చే సవ్వారి.

కలత నిద్రల కలవరింతల్లో
కంటి పాపల కదలికల్ని మెలకువలుగా మార్చుకొని
కసాయి రాత్రుల్ని ప్రేమగా తెల్లార్చే తాపసి.

సముద్రమంత ప్రేమని పంటి బిగువున అదిమి
కంటి పాపలపై..
కొండంత కారుణ్యాన్ని.. 'కోపం'గా ప్రదర్శించే
మమతల మాంత్రికుడు.

విశాల హృదయ పీఠంపై
నిశ్చింతగా ఓలలాడుతున్న పసితనానికి
ఆత్మ విశ్వాసపు వేదికపై, అనుభవాల్ని రంగరించి
జీవిత పాఠాన్ని బోధించే నేర్పరి.

అదుపు తప్పి
అడుసులో కూరుకుపోతున్న వయసు చక్రాన్ని
మో'దండలతో పైకెత్తి బ్రతుకు రథాన్ని
పూల దారుల్లోకి మళ్ళించే కారుణ్య సారథి.



– రెడ్డి. రమాదేవి
సెల్: 8008 531677

## నీ జ్ఞాపకాల నీడల్లో

కుప్పలు కుప్పలుగా పేరుకున్న కష్టాల్లో
నా వాటాల్ని నేనే పంచుకుంటున్నా నాయిన
సుఖాల సువాసల్ని ఆస్వాదించటం కోసం
నీ జ్ఞాపకాల నీడల్ని తడుముకుంటున్నా
ఉగాది వచ్చిందంటే నువ్వే గుర్తొస్తావ్
వత్సరమంతా నీ వాత్సల్యాన్ని నెమరేస్తునే
ఛిద్రమైన జీవన రేఖల్ని అందంగా చిత్రిస్తున్నా.

చూపుల్లో చీకట్లను చింపుకొని
వెలుగు మెట్లను ఎక్కుతున్నా
గతం చిమ్మిన విషాద ఛాయల్లోకి తొంగిచూస్తానా
దుఃఖం పొంగుకు వస్తది
రక్తం చెమటగ మారినప్పుడల్లా
కళ్లల్లో నీళ్లు నిండుతయ్
ఉడుకు నెత్తుర్ని మూటగట్టుకొని
నేను పరుగు తీస్తున్నప్పుడల్లా
నీ చూపుల్లో ఎర్రటి చారల ఆదేశం
నన్ను నేటికీ రక్షిస్తున్నాయ్ నాయిన.

భాగ్యనగరంలో బిర్లామందిర్ ఎక్కినప్పుడు
సాలార్‌జంగ్ మ్యూజియంలో
పొట్టిభటుడు పన్నెండు గంటలు కొట్టినప్పుడు
ట్యాంక్‌బండ్‌పై నుండి బుద్ధవిగ్రహం చూస్తున్నప్పుడు
నీ సహచర్యపు సంతోషాలే రివ్వున మదిలో.

సమస్యలు శూలాలై పొడుస్తున్నప్పుడు
ఎగిసిపడే దుఃఖాన్ని మ్రింగుతున్నప్పుడు
అక్కున చేర్చుకునే ఆత్మీయులు కానరానప్పుడు
నువ్వే గుర్తొస్తావ్..! బోరున ఏడుస్తాను
ఏడవద్దంటూ అద్దం ముందు చిన్నోడు
అద్దంలో ఆశీస్సులలో నువ్వు...!



– డా॥ కటుకోఝ్వల రమేష్
సెల్:9949083327

# విభిన్నమైన కవితా ప్రక్రియ "రెక్కలు"



జీవితానుభవాల నుంచి ఉద్భవించే ఏ సాహితీ ప్రక్రియ అయినా.. సంజీవిని భావ పరిపుష్టతతో తొణికిసలాడుతూ బుజుమార్గాన్ని దిశానిర్దేశం చేస్తూ ఉంటుంది.

అలాంటి జీవ భాండాగారం నుండి జాలువారిన అమృత సాహితీ ప్రక్రియే 'రెక్కలు..' నాలుగు+ రెండు పాదాల పొందికలో అద్భుత భావం నిక్షిప్తమై ఉంది. చివరన ఇచ్చే రెండు పాదాల ముగింపు.. ఊహించని భావ స్ఫోరకంతో పాఠకుడి హృదయంలో అపురూప శిల్పంలా నిలిచిపోతుంది. ఈ రెండు పాదాల భూమిక తాత్విక మర్మాలను విశదీకరిస్తూ.. కొత్త లోకాలలోకి ప్రయాణింప చేస్తుంది.

ధనుస్సు, బాణం దేనికది విడిగా వుంటే.. నిరుపయోగమే కదా! కానీ ఆ రెండింటిని ఒక్కటి చేసి.. గురి చూసి లక్ష్యాన్ని ఛేదించడంతో సాఫల్యత దక్కుతుంది. అలాంటి విశేషాన్ని మనం 'రెక్కలు' ప్రక్రియ ద్వారా ఆస్వాదించవచ్చు!

ప్రముఖ కవి, రెక్కల రూపశిల్పి సుగమ్‌బాబుతో వంగ పరమేశ్వర రావు ముఖాముఖి.

–సంపాదకులు

● మీ సాహిత్య ప్రవేశం ఎప్పుడు, ఎలా జరిగింది?

○ నేను సాహిత్యంలోకి ప్రవేశించి ఏభై సంవత్సరాలు.. అంటే 'గోల్డెన్ జూబ్లీ' జరిగింది. నేను స్కూలు ఫైనల్ చదువుతున్న రోజుల్లోనే.. కవిత్వం వైపు మొగ్గాను.

● కవిత్వాన్నే ఎందుకు ఎంచుకున్నారు?

○ ఎరుపు అంటే ఇష్టం కనుక!

● కవిగా మీ డెవలప్‌మెంట్స్ చెబుతారా?

○ నా కవితా ప్రయాణం చాల చిత్రమైంది. నా సాహిత్య జీవితాన్ని రెండు భాగాలుగా చెప్పవచ్చు. 1960 నుంచి 1970 వరకు ఒక భాగం అయితే, 1982 నుంచి రెండో భాగం. పైగంబర కవులు 1970లో గుంటూరు జిల్లాలో ఉద్భవించారు. 1971లో వి.ర.సం. ఆవిర్భావం! నేను, ఓల్గా, కిరణ్‌బాబు వి.ర. సం.లో సభ్యులుగా చేరాం. కమలాకాంత్, దేవీప్రియ బయటే ఉండిపోయారు. అప్పట్లో వి.ర.సి. సభ్యుల మీద పోలీసుల నిఘా వుండేది. నేను 1972లో రాసిన 'సూరీడు పాటలు' వి.ర.సం. ఆవిర్భావం తర్వాత వచ్చిన తొలి పాటల సంపుటి.

● మీ సాహిత్య జీవితంలోని రెండవ భాగం గురించి చెప్పండి?

○ మొదటి–రెండు భాగాల మధ్య దాదాపు పదేళ్ళు సినిమా జీవితం...! 1982లో హైదరాబాద్ వచ్చాను. జర్నలిస్ట్‌గా బ్రతికే ప్రయత్నం చేశాను.

● 'రెక్కలు' రాయడానికి ఇన్‌స్పిరేషన్ ఏదైనా వుందా?

○ హైకూ

● నానీల తర్వాతనే రెక్కలు ప్రక్రియ వచ్చింది. నానీల గురించి మీ అభిప్రాయం?

○ 'నానీ' ఒక సాధారణ లఘు రూపం. అయితే చాలా మంది నానీలు రాసి కవులు అనిపించుకున్నారు.

● 'రెక్కలు' గురించి చెప్పండి?

○ 'రెక్కలు ప్రక్రియ ఒక విభిన్నమైన కవితా రూపం! ఇది రెండు భాగాలుగా ఉంటుంది. 4+2 పంక్తులు.

● కొంచెం వివరంగా చెప్పండి?

○ కవితలోని మొదటి నాలుగు పాదాలు 'ధనుస్సు' అనుకుందాం! చివరి రెండు పాదాలు 'బాణం'. ఈ రెంటి అనుసంధానంతో లక్ష్యాన్ని ఎంత బలంగా ఛేదించవచ్చో.. ఊహిస్తే తెలుస్తుంది! చివరి రెండు పంక్తుల పొడిగింపు వల్ల కాన్వాస్ పెరిగింది. అది కవికి పెద్ద వెసులుబాటు కలిగించింది. అందువల్లే రెక్కల ప్రక్రియలో అనేక ప్రయోగాలు జరిగాయి.

● అవి ఏమిటో చెప్పండి?

○ మొదటిగా చెప్పాల్సింది. పులగం వీరారెడ్డి అనే కవి రెక్కలు ప్రక్రియలో రాసిన 'ఛాణక్య నీతి'. రెండవది డి. హనుమంతరావు అనే ఉపాధ్యాయుడు రెక్కలుగా చేసిన అనుసృజన 'ఠాగూర్ గీతాంజలి'. మూడవది పెద్దూరి వెంకటదాసు తెలంగాణ ఉద్యమ నాయకుడు కె.సి.ఆర్‌పై రాసిన 'రెక్కల సంపుటి 'తెలంగాణ కేసరి'. ఆ తర్వాత యువతకు వివేకానంద సందేశాలు రెక్కలుగా వచ్చిన 'రెక్కల సంపుటి', 'శిఖరం', ఇలా..

● మీరు రాసిన ఒక రెక్కను విశ్లేషించి చెప్పగలరా?

○ ఈ రెక్కను గమనించండి!

"ముందడుగు
అంటే
కొత్త దారిలోకి
అడుగెయ్యడం–
సూర్యుడుతో
స్నేహం"!

మొదటి నాలుగు పంక్తులు సాధారణంగానే వున్నా.. చివరి రెండు పంక్తులు అసాధారణంగా ఉంటాయి. అందుచేతనే పాఠకులలో ఒక అటెక్షన్ వస్తుంది.

**"సూర్యుడుతో/ స్నేహం!"** అన్న పదాలకు మీరు ఎంతేసి అర్థాలైనా చెప్పుకునే వీలు ఉంది. ఎంతేసి దూరాలకైనా విస్తరించే అవకాశం ఉంది. డా॥అద్దేపల్లి చెప్పినట్టు– "రెక్క రాయటం కవి వివేకానికి సవాల్ మాత్రమే కాదు, పాఠకుడి ఆలోచనలకు పదును పెట్టినట్టే...!"

● లఘు రూప ప్రక్రియలన్నీ వచన కవిత్వమే అంటున్నారు?

○ అవును కదా! వచన కవిత్వానికి ప్రతి ఏటా అవార్డులిచ్చే సాహిత్య సంస్థలకే ఆ విచక్షణ లేదు.

● లఘురూప ప్రక్రియలు కూడా మినీ కవిత్వమేనా?

○ నాకైతే 'మినీ కవిత్వం' అనే మాట కంపరం కలిగిస్తుంది. మినీ కవిత్వం అనే పద ప్రయోగం కవిత్వ రీతి తెలియని వారు సృష్టించిందే!

● కవిత్వ రీతి అంటే?

○ అంటే చిన్న కవితకైనా– పెద్ద కవితకైనా సమగ్రత అనేది ప్రాణం! పంక్తులను బట్టి చిన్న– పెద్ద అని నిర్ణయించడం సరికాదు. పురిటి నెప్పులు కవికి తెలియనివి కావు.

● మీకు నచ్చిన కవులు ఎవరో చెబుతారా!

○ ఏభై ఏళ్ళకు పైబడ్డా, ఇంకా ఏదో రాయాలని తన చుట్టూ వున్న వారికి, ఏదో చెప్పాలని అహర్నిశలు తపిస్తున్న కవి మిత్రులు చాలా మంది! వారందరూ పేరు– పేరున నా అభిమాన కవులే!

● యువ కవులకు మీరేం చెబుతారు?

○ కవిత్వం రాయటం అనేది ఒక విద్య. చూస్తేనో, ఎవరో చెబితేనో, ఒకరిని ఆశ్రయిస్తేనో రాదు. ఎవరి అనుభవం వారిని, రాయించాలి. అయితే ఇదేదో కొరకుడు పడనిది కాదు! కవిత్వం రాయదల్చిన వారు ముఖ్యంగా నవకాలీన కవిత్వాన్ని విస్తృతంగా అధ్యయనం చేయాలి. ఆలోచనలపై, అలాగే భాషపై పట్టు సాధించాలి, ఇది జరగాలి!



– వంగ పరమేశ్వరరావు
సెల్: 8143237847

## ప్రజలు–నాయకులు

ప్రజల మేలును కోరుతూ
ప్రజలకు మంచి భవిష్యత్ భవనాన్ని
నిర్మించడానికి
ప్రతీక్షణం తాపత్రయపడుతూ
ప్రజల పలు సమస్యల పరిష్క్రియాశీలురై
జీవించేవారు– నిన్నటి నాయకులు!

ప్రజల సమస్యల ప్రస్తావనలతో
నాయకులుగా ఎదిగి
వాటిని అపరిష్కృతంగా
సజీవంగా ఉంచుతూ
ప్రజల కష్టాల 'వల్లెవేత'యే ఊపిరిగా జీవిస్తూ
ప్రజల బలహీనతలపైననే
ప్రధానంగా ఆధారపడి బలపడుతూ
స్వప్రయోజనాలే పునాదులుగా
సొంత భవిష్యత్ భవనాన్ని
పకడ్బందీగా నిర్మించుకుంటున్నారు
ఇప్పటి నాయకులు!



– రఘువర్మ
సెల్: 9290093933

## పరామర్శ–పరిహారం

రోడ్డు బాగా లేకుంటే
పట్టించుకోని వాళ్లు

కాలంచెల్లిన బస్సులను
అనుమతించిన వాళ్లు

క్రిక్కిరిసిన జనం ఉంటే
ఆదాయం వస్తుందని
ఆనందించిన వాళ్లు

సుదిక్షణ లేని డ్రైవర్లను
పురమాయించిన వాళ్లు–
ప్రాణాలు పోగొట్టుకున్నాక
ప్రజలను పరామర్శిస్తున్నారు
పరిహారం ప్రకటిస్తున్నారు.



– ఎ. గజేందర్ రెడ్డి
సెల్: 98488 94096

## అక్షరమిత్రుడు

నిత్యం నాకొక అక్షరమిత్రుడు కావాలి
అంతరంగం గదులన్నీ వెలుగులు నింపాలి!!

సాహితీనేస్తం దొరికినరోజు పండగవుతుంది.
హృదయం కాళేశ్వరంలాగా ఉప్పొంగిపోతుంది!
మా మధ్య మాటలు ముత్యాలహారంగా ఉంటుంది
మా మంచి ఆలోచనలు ఆచరణ అవుతుంది!!

సాహితీ స్నేహితులంతా ఒక చోట కూర్చుని
ప్రతి మాటకు ఉన్న అర్థం విప్పుకుంటూ!
నవ్వులు నవ్వుకుంటూ ఎదనిండా నింపుకుంటూ
వెన్నెల రాత్రులలో సంతోషంగా ఉంటాం!!

మిత్రుల కళ్ళల్లో ఆనంద భాష్పాలు
వారి నవ్వుల్లో స్నేహ జీవనది ప్రవాహాలు!
ఇంటినిండా వెలుగులునిచ్చే కాంతివలయాలు!
ఎదనిండా మంచి మిత్రుల సాహితీముద్రలు!!



– డా॥కర్నాటి లింగయ్య
సెల్: 9515298610

## నువ్వెవరివి?

నువ్వు కారిణ్యుడివా?
అయితే త్రికరణశుద్ధిగా
నీ మనసు వెన్నెముద్ద
నువ్వు ప్రేమ పిచ్చోడివా?
అయితే కాక మానదు
నీ జీవితం అధోగతి
నువ్వు అవినీతి పరుడివా?
అయితే రాక మానదు
భవిష్యత్తులో పెనుతుఫాను
నువ్వు మోసగాడివా
అయితే తప్పక వస్తుంది
జీవన యానంలో
తల్లక్రిందులయ్యేరోజు
నువ్వు అందగాడివా
అయితే తప్పదు
నీకు ప్రేమ సునామీ
నువ్వు కుటుంబీకుడివా?
అయితే మునగక తప్పదు
నడి సంద్రంలో అలల తాకిడికి
నీదిదయార్ద్ర హృదయమా?
అయితే కూరుకుపోకతప్పదు
కష్టాల కడలిలో
నువు మానవత్వంగల మనిషివా?
అయితే పరులు
దైవాన్ని నాలోనే చూడగలరు.



–రాయవరపు సరస్వతి
9885656356

## సాక్షి

పావురాలు లేవు పిట్టలు లేవు
ఆకాశంలో గద్దలు మాత్రమే ఎగురుతున్నాయి
ఆకాశం స్వేచ్ఛగా లేదు
నియంతృత్వ గాలులకు
నల్లటి మేఘాలు చెల్లా చెదురయ్యాయి
వర్షం లేదు
పడిన చినుకులో బలం లేదు
అంతానేనే నా రాజ్యం
తుపాకీ విజృంభణకు
చుక్కలు వనికిపోతున్నాయి
వెన్నెల దుఃఖిస్తూ వుంది
ఆకాశం బంధీలో వుంది
శాంతిలేదు సమత లేదు
మాటలలో హింస
చేతలలో హింస
కొత్తరకం రాబందులు పుట్టుకొచ్చాయి
ఎంతకాలం?
చరిత్ర ఎందరినో చూచింది
నియంతలను ఎందరినో మింగింది.



– సి. హెచ్. మధు
సెల్: 9949486122

## నానీలు

ప్రేమ
రెండక్షరాల పదమే...
అనంత అనురాగాన్ని
వ్యక్తీకరిస్తూ...!!

గుండె పరిమాణం
గుప్పెడే...!
సముద్రమంత ప్రేమ
ఎలా ఇమిడిందో...!!

కన్నూ కన్నూ
కలిస్తే ప్రేమే...!
ప్రేమంటే
బాధ్యతల సమాహారం!!



–వెగ్గలం ఉషశ్రీ
9440370066

## వాడు

తనను తానుగ తగలెట్టుకునేటోడు
ఉంటేనేం? లేకుంటేనేం? ఏమైతేనేం?
తనను తాను నిలువునా నిలబెట్టుకునే
వాడే తోటివార్ని నిలబెట్టి ఆకట్టుకోగలడు!
కోట్లాది గుండెల జనాగ్రహాన్ని నిత్యంచూస్తూ
నిట్టూరిస్తేకాదు జ్వలించే వెలుగై విప్లవించాలి!
నరమేధానికి ముందరే వాణ్ణి నిలదీయాలి!
నవజీవన కురుక్షేత్రంలో కారణ కార్యక్షేత్రాన
అణువిస్ఫోటన ఆపేరాజీ కుదరి తీరాల్సిందే!
దుర్యోధన దుస్సాశన సామ్రాజ్యవాదం అణగాలి!
సలసలమండే నిప్పుల్లో లోహనిటి ధారలు
ప్రవహించి ఉక్కుకడ్డీల రూపాంతరమై
భువన భవన సౌందర్యానికి అంతరంగమవ్వాలి!!
మేఘాలు తేలిపోయిన ఆకసంలా కానేకాదు
ముసిరి కరిసిన కారుమేఘాల్లా పరిపుష్టమవ్వాలి!!
నలుదిక్కులా వంగి ఆక్రమించిన నింగిలాగా
ప్రపంచం మొత్తం నాదేనని ధీమాగా ఉపక్రమించాలి!!
అగ్నిలా భగ్గుంగా జ్వలించినా దగ్ధం కారాదు
వాడే నేటి అవ్యవస్థ ప్రశ్నార్థకానికి
సరైన జవాబు!!



– యల్. రాజా గణేష్
సెల్: 9247483700



ఫిబ్రవరి 21న శ్రీ త్యాగరాయ గానసభ కళాసుబ్బారావు కళావేదికలో జి.వి.ఆర్. ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ నిర్వహించిన కార్యక్రమంలో గాయని భూదేవి సేకరించి సంకలనం చేసిన 'భారతమాతకు జేజేలు' అనే దేశభక్తి గీతాల పుస్తకాన్ని మండలి బుద్ధప్రసాద్ ఆవిష్కరించగా డా॥కె.వి.రమణాచారి అంకితంగా స్వీకరించారు. చిత్రంలో పెద్దూరి వెంకటదాసు, గుదిబండి వెంకటరెడ్డి, అనంతలక్ష్మి, డా॥చిల్లా రాజశేఖరరెడ్డి, గోపాలకృష్ణసాయి, సినీనటుడు ఉత్తేజ్, సంజయ్‌కిషోర్, వి.వి.రాఘవరెడ్డి.

## అక్షర మంజీరాలు

నిలువెత్తు ఆకుపచ్చని నీడను
గుండెనిండా దాచుకుని
మట్టి పొత్తిళ్ళల్లోంచి తలెత్తే
విత్తనమా నీకు వందనం.

ఎన్నివేల క్షణాలు
తపస్సు చేసిందో కాగితం
అక్షరాల చెలిమి
కరచాలనం కోసం..

అడవి గుండెను తొలుచుకుంటూ
సాగే మనిషి కళ్ళలో
కన్నీళ్ళున్నాయా.. ఏమో..
పచ్చదనం చెదిరి చెల్లాచెదురై దిగులు
ఆకాశంలోకి విస్తరిస్తోంది
చెమ్మదనం చెరువు ఒడిలో విలపిస్తోంది
ఎడారి దారుల్లో వసంతం కోసం వెతుకుతున్నాడు.
కాలం వేగపు పరుగులో
కనుమరుగైన కాగితం పడవలు
జారే కన్నీటిని పారే ప్రవాహపు అడుగున
దాచుకుంటూ..
దీపానికెంత కరుణ
కాసింత దాహం తీరిస్తే

కొండంత ఆశల వెలుగును
ఆహారంగా అందిస్తుంది
వేల కిరణాల చేతుల్తో.

పక్షులు లేని ఆకాశంలో
మేఘాలు వరుసగా
దిగులు దారాల్ని
పేనుతున్నట్లు
ధారలు ధారలుగా
కిందకి జారుతూ..

వర్షానికి వైషమ్యాల్లేవు
కాలువల్ని చెరువుల్ని
చేరపిలుచుకుని
కడలి ఒడిలోకి చేరుతుంది
తనువెల్లా తడుస్తూనే..

రాలిన ఆకుల శ్వాస
విడరాని స్మృతిలా
కొమ్మల మొదళ్ళను
మునివేళ్ళతో మెలిపెడుతూ..

శూన్యం అంచులనిండా
పరిమళం దూపంలా
ఏవిరి మౌనంగా
వికసించిందో మరి.



– మొదలిపద్మ
92482 59622

